# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :74 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 18-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## నకిలీ సర్టిఫికెట్ల దందా...ఆరుగురి ముఠా అరెస్ట్

హైదరాబాద్, గత తొమ్మిదేళ్లుగా నకిలీ సర్టిఫికెట్ల దందాను కొనసాగిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలంగా ధనార్జనే ధ్యేయంగా దందా సాగుతున్నట్లు గుర్తించామన్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఒక్కో నకిలీ డాక్యుమెంట్‌ను రూ. 5వేల నుంచి రూ. 20వేల వరకు విక్రయిస్తున్నారని వివరించారు. నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ అక్రమ దందాకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురిని అరెస్టు చేయగా.. మరో ఏడుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. భానుప్రకాశ్, సాగరిక దంపతులు సరూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సాత్విక్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో నోటరీ షాపు నిర్వహిస్తున్నారు. అధిక డబ్బుల కోసం ఆశపడి నకిలీ బర్త్, ఇన్‌కమ్, క్యాస్ట్ సహా భూమి క్రయవిక్రయాలకు సంబంధించిన ఫేక్ డాక్యుమెంట్లు-, ఫోర్జరీ పత్రాలు సృష్టించే వారని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఇందుకోసం నిందితులు కొందరు వ్యక్తులతో చేతులు కలిపి ఓ వ్యవస్థనే ఏర్పాటు చేశారని వెల్లడించారు.


## పాక్ దుర్నీతిని ఎండగట్టేందుకు దౌత్యనీతి



న్యూఢిల్లీ,మే17: భారత్‌పై ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతోన్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేసేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కొందరిని ఎంపిక చేసింది. వీరంతా వివిధ దేశాలకు వెళ్లి పాక్ ఉగ్ర కుట్రలను వివరిస్తారు. ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపీల పేర్లను శనివారం కేంద్రం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఈ ఏడుగురిలో ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్(భాజపా), బైజయంత్ పాండా (భాజపా) సంజయ్ కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ -ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసే)లు ఉన్నారు. వీరంతా విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఈవిషయంపై కేంద్ర ప్రభుత్వం విపక్షాలతో చర్చలు జరిపి బృంద సభ్యులను ఎంపిక చేసింది. వీరు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. ఈ బృందాలు ముఖ్యంగా ఐదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించ నున్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు, పాక్ బెదిరింపులకు ధీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరించడం, భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత ఇవ్వనున్నారు. అలాగే ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం చేస్తారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ..ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను.. దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును కూడా ఈ సందర్భంగా వివరించడం జరుగుతుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్.. పాక్‌పై అనేక దౌత్య చర్యలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులను తిరిగి స్వదేశానికి పంపడం, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవడం వంటి చర్యలు చేపట్టింది. అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసి, ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాల రాయబారులు, మంత్రులకు ప్రత్యేక వివరణ ఇచ్చింది. ఆ ప్రతినిధుల బృందాలకు ఏడుగురు ఎంపీలు నాయకత్వం వహిస్తుండగా.. వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ కూడా ఉన్నారు. అయితే కాంగ్రెస్ పంపిన జాబితాలో అసలు థరూర్ పేరు లేకపోవడం గమనార్హం. పాక్‌ను ఎండగట్టేందుకు పంపే బృందం కోసం పేర్లు పంపాలని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మే 16న కాంగ్రెస్‌ను కోరగా, అదేరోజున కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ నాలుగు పేర్లు పంపారు. వారిలో కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ, రాజ్యసభ ఎంపీ డాక్టర్ సయ్యద్ నజీర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్, మరో నేత గౌరవ్ గొగొయ్ ఉన్నారని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ జాబితాలో థరూర్ పేరు లేదు. అయితే శనివారం కేంద్రం విడుదల చేసిన తుది జాబితాలో వారి పేర్లేవీ లేవు. కానీ తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు మాత్రం అనూహ్యంగా చోటు-దక్కింది. ఇటీవలి పరిణామాలపై దేశం విధానాన్ని వివిధ దేశాలకు వివరించేందుకు వెళ్తున్న బృందానికి నాయకత్వం వహించడం గౌరవంగా భావిస్తున్నాను. దేశ ప్రయోజనాలతో ముడిపడిన సందర్భాల్లో అక్కడ నా అవసరం ఉంటే.. నేను అందుబాటులో ఉంటా. జైహింద్ అని థరూర్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

## ఆర్టీసీకి రూ.5,200 కోట్లు ఇచ్చాం.. ఆర్టీసీ కూడా ఇప్పుడు లాభాల బాటలో..!

హైదరాబాద్,మహిళల శక్తిని ప్రేరణగా తీసుకుని, రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేలా చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.కోటి మంది మహిళలు కోటీశ్వరులవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వీహబ్ వుమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మహిళా స్టాళ్లను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా శక్తిని ఎప్పుడూ గౌరవిస్తుందని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. రూ. 5,200 కోట్లను మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి ఇచ్చామని, ఆర్టీసీ కూడా ఇప్పుడు లాభాల బాటలో నడుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.ఇందిరా గాంధీ మహిళా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన ఘనతవహించిందన్నారు. మన రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలంటే, మహిళలు ఆర్థికంగా స్వావలంబులవ్వాలి. ఇందుకోసం ప్రభుత్వం ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాలు తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. గ్యాస్ సిలిండర్లను రూ. 500కే అందిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ బాధ్యతను మహిళలకు అప్పగించామని, మహిళా



సంఘాలు, సొంత వ్యాపారాలు పెరిగేలా స్టార్టప్ మద్దతు ఇస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు.ఈ నెల 21న "ఇందిరా మహిళా స్టాళ్లను" మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించనున్నట్లు సీఎం వెల్లడించారు. సెర్ప్ సభ్యుల సంఖ్యను కోటి మందికి పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. "కార్పొరేట్ కంపెనీలకు డబ్బులు ఇచ్చినప్పుడు వారు దేశం విడిచి వెళ్తున్నారు. కానీ మహిళలకు ఇచ్చే రూపాయికి విలువ ఉంది.. వారు సమర్థంగా వినియోగించి వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తున్నారు," అని చెప్పారు.

## మిషన్ భగీరథకు మోకాలడ్డు



నల్లగొండ,మే17, మిషన్ భగీరథ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ నివారణ జరిగేదని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. అయితే కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని కాంగ్రెస్ కొనసాగించడం లేదన్నారు. ఇంటింటికి నీరు వస్తేనే ఫ్లోరైడ్ దూరం అవుతుందిన జగదీశ్వర్ రెడ్డి అంగీకరించారు. ఇందుకు భగీరథ ఒక్కటే పరిష్కారం అన్నారు. భూగర్భ జలాల వినియోగం తగ్గితేనే ఇది సాధ్యం అన్నారు. శాశ్వత కరువు, ఫ్లోరోసిస్ నివారణకు కృష్ణా జలాలు అందించాలన్న పథకం ముందుకు సాగక పోవడంతో ఫ్లోరైడ్ గ్రామాలకు శాప విమోచనం కలగడంలేదు. జిల్లాలోని దేవరకొండ, మునుగోడు, ఈ ప్రాంత ప్రజలు ఫ్లోరైడ్‌తో పోరాడుతున్నారు. ఫలితంగా నక్కలగండి ఎత్తిపోతల ద్వారా కృష్ణా జలాలు అందించనున్నట్టు ఆనటి కెసిఆర్ ప్రభుత్వం ప్రకటించి, ముప్పై లక్షలు కేటాయించింది. కానీ ఈ ప్రభుత్వం ఈ పథకాన్ని నేటికీ పూర్తి చేయకపోవడంతో ప్రజలకు మంచినీటి లక్ష్యం నెరవేరడం లేదు. శ్రీశైలం ఎడమగట్టు సొరంగం పథకాన్ని చేపట్టి గ్రావిటీ ద్వారా 30 టీఎంసీల నీరు నల్గొండ జిల్లాలో అదనంగా మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, 700 గ్రామాలకు తాగునీరు అందించాలని జిల్లా ప్రజలు ఆందోళన చేపట్టారు. దీంతో గతంలో నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా శ్రీశైలం కుడి, ఎడమ కాల్వలకు శంకుస్థాపన చేశారు. అయితే కుడి కాలువ పనులు పూర్తయ్యాయి. ఎడమ కాలువ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఎస్ఎల్‌బీసీని పెండింగ్‌లో పెట్టి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడం జరిగింది. శ్రీశైలం సొరంగం పథకాన్ని చేపట్టాలన్న జిల్లా ప్రజల ఆందోళనతో అనుమతిచ్చారు. దీన్ని నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉండగా, గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించనందున పూర్తికాలేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే యాభై ఏళ్లు గడిచినా ఈ ప్రాజెక్టు పూర్తికాదు. కాబట్టి తక్షణమే పూర్తిచేసి అందులో అంతర్భాగమైన నక్కలగండి (లోయర్‌డిండి) రిజర్వాయర్ పనులను వెంటనే ప్రారంభించాలి. ఈ పథకంలో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం ద్వారావచ్చే నాలుగువేల క్యూసెక్కులలో మూడువేల క్యూసెక్కులను దిగువ డిండి (నక్కలగండి) జలాశయం నుంచి రెండు స్టేజీలలో ఎగువ డిండికి 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి 3.4 లక్షల ఎకరాలకు సాగునీరందించే సౌకర్యం ఉన్నది. శ్రీశైలం సొరంగ మార్గం ద్వారా వచ్చే నీటిని నక్కలగండి (చందంపేట మండలం) వద్ద 7. టీఎంసీల సామర్థ్యంతో లోయర్ డిండి రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచి ఎడమ కాలువ ద్వారా ఏఎమ్మార్పీకి సరఫరా చేస్తారు. గోనబోయినపల్లి సమీపంలోని మేళ్లచెరువును మిడ్ డిండి రిజర్వాయర్‌గా 11 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తారు. మిడ్ డిండి నుంచి 12.75 కిలోమీటర్ల సొరంగం ద్వారా పంప్‌హౌస్‌కు నీటిని విడుదల చేసి, అక్కడి నుంచి 560 మీటర్ల పొడవు, మూడుమీటర్ల వ్యాసార్థం కలిగిన ఆరు పైపుల ద్వారా 134 మీటర్ల ఎత్తు నుంచి అప్పర్ డిండికి సరఫరా చేస్తారు. ప్రస్తుత డిండి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 7.2 టీఎంసీలకు పెంచుతారు. మధ్య డిండి రిజర్వాయర్ నుంచి .7 కిలోమీటర్ల పొడవు కాల్వలు తవ్వుతారు. ఈ కాలువకు మధ్యలో కాసారం, దేవరకొండ, సామలపల్లి గ్రామాల వద్ద 7 టీఎంసీల సామర్థ్యంతో మూడు రిజర్వాయర్లు నిర్మిస్తారు. ఇవేగాక మైనంపల్లి, ఉప్పువాగు, నాంపల్లి, ఇర్విన్ వద్ద కూడా రిజర్వాయర్లు ఏర్పాటు- చేస్తారు. మిడ్ డిండి ద్వారా డిండి, దేవరకొండ, చందంపేట, గుర్రంపోడ్, ఉప్పువాగు, నాంపల్లి, మునుగోడు, చండూరు, కనగల్లు, నల్గొండ మండలాలలో సుమారు 90,500 ఎకరాలు, అచ్చంపేట మండలంలో 1000 ఎకరాలకు సాగునీరు అందుతుంది. నల్గొండ జిల్లాలో పశ్చిమ భాగంగా ఉన్న దేవరకొండ, మునుగోడు, నల్గొండ నియోజకవర్గాల్లో 14 కరువు పీడిత మండలాలలో మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ఐదు మండలాల్లో సాగు, తాగునీరు అందించే ఈ పథకానికి ప్రణాళిక చేశారు.

## సంక్షేమం తెలంగాణను సంక్షోభంలోకి నెట్టారు

మహబూబాబాద్,మే17: రైతు సంక్షేమంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగిందని , కానీ కాంగ్రెస్ వచ్చాక దానిని పూర్తిగా విస్మరించారని మాజీ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. సకల జనుల అభ్యున్నతే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగిందని శనివారం నాడిక్కడ అన్నారు. రైతుల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. రైతులకు అండగా నిలిచేలా పెట్టుబడి పథకం దేశం ఎక్కడైనా అమలు చేస్తున్నారా చెప్పాలన్నారు. కానీ కాంగ్రెస్ సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని అన్నారు. కెసిఆర్ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదో కాంగ్రెస్ నేతలు చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజలను మభ్యపెట్టలేరని అన్నారు. ప్రతి వర్గానికి చేదోడువాదోడుగా నిలిచేలా పథకాలు అమలు చేసిన ఘనత మాజీ సిఎం కెసిఆర్‌దని అన్నారు. నాయకులు తమ స్వలాభం కోసం, స్వార్థం కోసం సిద్ధాంతాలను విస్మరించడం వల్లే బిఆర్ఎస్ ఓడిందని స్పష్టం చేశారు. తండాలన్నీ కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసి ఎన్నికలు జరిపిన ఘనత కెసిఆర్‌దన్నారు. ఇకపోతే ఏటా వర్షాకాలంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం



మాయమయ్యిందని అన్నారు. అడవుల విస్తీర్ణం తగ్గడంతో వర్షాలు సమృద్ధిగా కురువడం లేదన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే అందరూ మొక్కలు నాటడమే మార్గమని కెసిఆర్ గుర్తించారని అన్నారు. రైతులు వర్షంపై అధారపడి పంటలు పండిస్తారని వానలు కురవాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని తెలిపారు.

## ముంబైలో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదుల పట్టివేత




ముంబై,మే17: పహల్గాం ఘటన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట కొనసాగుతోంది.తాజాగా ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇద్దరు ఐసిస్ అనుమానిత ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు అరెస్ట్ చేశారు. ఇండోనేషియాలోని జకార్తా నుంచి భారత్‌కు వచ్చిన ఐసిస్ సభ్యులు అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్‌లను అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి విమానాశ్రయంలోని టెర్మినల్ 2 వద్ద వీరు అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో ఇమిగ్రేషన్ బ్యూరో అధికారులు అడ్డుకున్నారు. ఐసిస్ స్లీపర్ సెల్ విభాగంతో వీరికి సంబంధాలు ఉన్నట్లు- గుర్తించామన్నారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇద్దరు నిందితులను ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నారు. 2023లో మహారాష్ట్రలోని పుణేలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ (ఐఈడీలు) తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో స్థానిక పోలీసులు ఇప్పటికే వీరిని గాలిస్తున్నట్లు సమాచారం. అప్పట్లో వీరు భారత్‌లో ఉన్న స్లీపర్ సెల్స్‌తో దేశంలో ఉగ్ర కుట్రలకు ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. అదే ప్రదేశంలో స్లీపర్ సెల్స్‌కు బాంబు తయారీ శిక్షణ వర్క్‌షాప్‌ను నిర్వహించారని అధికారులు తెలిపారు. వారిని పట్టుకోవడానికి సమాచారం ఇచ్చిన వారికి ఒక్కొక్కరికి రూ. 3 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించినట్లు- తెలుస్తోంది. గత రెండేళ్లుగా పరారీలో ఉన్న వీరు భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో ముంబయికి రావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు. వీరితో కలిపి ఇప్పటివరకు 10మంది ఐసిస్ సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు- తెలిపారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలనే భారత ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడం కోసం ఎన్ఐఏ తీవ్రంగా ప్రయత్నిస్తోందని అధికారులు పేర్కొన్నారు. భారత్‌లో ఐసిస్ కార్యకలాపాలను నిర్వీర్యం చేయడానికి ఏజెన్సీ చేస్తున్న ప్రయత్నాలలో ఈ అరెస్టులు ఒక ప్రధాన ముందడుగని తెలిపారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ బృందాలు ఉగ్రవాదుల జాడ కోసం జమ్మూకశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నాయి. శనివారం స్థానిక అధికారులతో కలిసి ఉత్తరకశ్మీర్‌లోని కుప్వారా, శ్రీనగర్, గందర్‌బాల్, బారాముల్లా సహా 10 ప్రదేశాల్లో సోదాలు చేపట్టినట్లు- అధికారులు పేర్కొన్నారు. మరోవైపు పంజాబ్‌లోని బబ్బర్ ఖల్సా ఉగ్రవాద సంస్థకు చెందిన 15 ప్రదేశాలపై ఎన్ఐఏ బృందాలు దాడులు చేశాయి.

### డ్రగ్స్ కట్టడిలో తెలంగాణ అగ్రస్థానం

హైదరాబాద్, డ్రగ్స్ కట్టడిలో ప్రపంచంలోనే తెలంగాణ అగ్రస్థానం సాధించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. 138 దేశాలతో పోటీపడి ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందని చెప్పారు. ఈ ఘనత సాధించిన హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు కృషి చేస్తున్న ప్రతి పోలీసుకు మద్దతుగా ఉంటామన్నారు. ప్రపంచానికే తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.


## చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

చర్లపల్లి, మే 17 : చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారి అరుణ్‌కుమార్ జైన్‌ను గురించి. ఈ మేరకు ఆయన ఎంటీఎస్ రైళ్లను పెంచడంతోపాటు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని అరుణ్‌కుమార్ జైన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ.. మెట్రోరైలు చార్జీలు పెరిగిన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో కలుపుతూ నడుస్తున్న రైళ్లను ప్రతీ ఒక్కరు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్ఎఫ్‌సీ రైల్వే బ్రిడ్జ్‌ను విస్తరించడంతోపాటు మౌలాలి రైల్వే స్టేషన్‌ను పరిశీలించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.అదేవిధంగా జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, ఐడీఏ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని



ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రైల్వే విభాగం అధికారులు నిర్వహించారు.

## మా కీలక ఎయిర్‌బేస్‌లపై భారత్ వైమానిక దాడులు నిజమే..



ఇస్లామాబాద్:ఉగ్రవాదులని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పిన విషయం. పహల్గాం ఉగ్రదాడికి 'ఆపరేషన్ సిందూర్' (ఆపరేషన్ సిందూర్)తో పాక్ (పాకిస్తాన్)పై భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. ఆ దేశంలో ఉగ్ర స్థావరాలు, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. భారత్ దాడితో తోకముడిచిన దాయాది.. చివరికి కాళ్లబేరానికి వచ్చింది. అయితే, ఇన్నాళ్లూ తమకు జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చుకుంటూ వస్తున్నా పాక్.. తాజాగా దాన్ని అంగీకరించింది. తమ కీలక ఎయిర్‌బేస్‌లపై భారత్ వైమానిక దాడులు జరిపిందని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ (షెహబాజ్ షరీఫ్) మీడియా సాక్షిగా ఒప్పుకున్నారు.శుక్రవారం రాత్రి ఇస్లామాబాద్‌లో ఒక కార్యక్రమంలో షెహబాజ్ షరీఫ్ ప్రసంగించారు. మే 10 తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తమ కీలకమైన వైమానిక స్థావరాలపై భారతదేశం జరిపిన ఖచ్చితమైన దాడులను ధ్రువీకరించారు. 'భారత ఆపరేషన్ ప్రారంభమైన కొన్ని క్షణాల తర్వాత ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ (అసిమ్ మునీర్) తెల్లవారుజామున 2.30 గంటలకు నాకు ఫోన్ చేశారు. దాడుల గురించి ఆయన నాకు తెలియజేశారు.

## సంపాదకీయం

**ఆదివారం 18-05-2025**

# స్వదేశీ ఆయుధాలతో అజేయ శక్తి

ఆధునిక యుద్ధాల తీరుతెన్నులు మారిపోతున్నాయి. నేడు ఎదురుదాడికీ, ఆత్మరక్షణకూ డ్రోన్లు, క్షిపణి నిరోధక వ్యవస్థలు అత్యంత కీలకమవుతున్నాయి. పూర్తిగా విదేశీ ఆయుధాలపైనే ఆధారపడటం ఏ దేశానికైనా ఆత్మహత్యా సదృశమవుతుంది. ఆయుధోత్పత్తిలో స్వావలంబన సాధించే దేశమే శత్రువు పీచమణచగలుగుతుంది. అందుకే, భారత్ సొంత గడ్డపై ఆయుధాల తయారీకి పెద్దపీట వేస్తోంది. ఆధునిక యుద్ధాల తీరుతెన్నులు మారిపోతున్నాయి. నేడు ఎదురుదాడికీ, ఆత్మరక్షణకూ డ్రోన్లు, క్షిపణి నిరోధక వ్యవస్థలు అత్యంత కీలకమవుతున్నాయి. పూర్తిగా విదేశీ ఆయుధాలపైనే ఆధారపడటం ఏ దేశానికైనా ఆత్మహత్యా సదృశమవుతుంది. ఆయుధోత్పత్తిలో స్వావలంబన సాధించే దేశమే శత్రువు పీచమణచగలుగుతుంది. అందుకే, భారత్ సొంత గడ్డపై ఆయుధాల తయారీకి పెద్దపీట వేస్తోంది. ఆయుధోత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించిన చైనా- తన ఆప్తమిత్రురాలైన పాకిస్థాన్‌కు దండిగా విమానాలు, క్షిపణులు వంటి వాటిని సరఫరా చేస్తోంది. వాటిని స్వశక్తితో ఎదుర్కోవడం ఇండియాకు అనివార్యమవుతోంది. నేడు ప్రపంచంలో రక్షణపై అత్యధికంగా వ్యయం చేస్తున్నది అమెరికా, చైనా, రష్యాలే. ఆ తరవాతి స్థానంలో భారత్ నిలుస్తున్నా, అవసరమైన ఆయుధాల్లో 40శాతాన్ని విదేశాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది! 2020-24 మధ్య దేశీయ ఆయుధ దిగుమతుల్లో 36శాతం రష్యా నుంచి, 33శాతం ఫ్రాన్స్, 18శాతం ఇజ్రాయెల్, మరో 13శాతం ఇతర దేశాల నుంచి వచ్చాయి. దేశ రక్షణ బడ్జెట్ ఏటికేడు పెరుగుతున్నా- అందులో అధిక భాగం జీతభత్యాలు, పింఛన్ల చెల్లింపులకే సరిపోతోంది. నిర్వహణ వ్యయం ఉండనే ఉంది. చివరికి ఆయుధ ఉత్పత్తి, కొనుగోళ్లకు మిగిలేది స్వల్పమే. 2013-14లో రూ.2.53లక్షల కోట్లుగా ఉన్న రక్షణ బడ్జెట్ 2025-26లో రూ.6.8లక్షల కోట్లకు పెరిగినా, ఈ ఏడాది ఆయుధాల సేకరణకు కేటాయించింది రూ.1.7లక్షల కోట్లే!

హైటెక్ సమరాంగణంలో...

దేశంలో మొదటి నుంచీ 16 ప్రభుత్వ రంగ రక్షణ సంస్థలు ఆయుధోత్పత్తి చేపడుతున్నాయి. ఇప్పుడు వీటికి తోడు 430 లైసెన్సుడు కంపెనీలు, 16వేల ఎంఎస్ఎంఈలు ఆయుధాలతో పాటు విడిభాగాలనూ తయారు చేస్తున్నాయి. 2023-24 చివరి నాటికి దేశీయ రక్షణోత్పత్తి విలువ రూ.1.27లక్షల కోట్లకు చేరింది. ఈ ఏడాది పాకిస్థాన్‌తో ఘర్షణ మొదలయ్యేనాటికే అది రూ.90వేల కోట్లకు చేరుకుంది. ఇవి కాకుండా 2024-25లో రూ.2.09లక్షల కోట్ల విలువైన 193 రక్షణ కాంట్రాక్టులను ఇచ్చారు. వీటిలో 92శాతం కాంట్రాక్టులను ప్రభుత్వ రంగ షిప్‌యార్డులకు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కూ అప్పగించారు. మరోవైపు, రక్షణ సాధనాల సేకరణ బోర్డు రూ.4.25లక్షల కోట్ల విలువైన కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. వాటిలో 90శాతం స్వదేశంలోనే జరుగుతాయి. కొత్త రక్షణ ప్రాజెక్టుల్లో అత్యధికం ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు కారిడార్లకు కేటాయించారు. గుజరాత్‌లోని వడోదరలో టాటా గ్రూపు రక్షణ పరిశ్రమలను ఏర్పాటుచేసింది. కానీ, దేశీయ అవసరాల్లో ఇదంతా సముద్రంలో నీటి బొట్టంత!

ఆధునిక యుద్ధాలు హైటెక్ ఆయుధాలతో జరుగుతాయి. భారత సాయుధ దళాలు వాడుతున్న ఆయుధాల్లో పాతవి తొలగించి, అత్యాధునికమైన వాటిని సమకూర్చడం తప్పనిసరి. వీటికోసం విదేశాలపై ఆధారపడకుండా పరిశోధన-అభివృద్ధికి, ఆయుధ తయారీ కర్మాగారాల స్థాపనకు పెద్దయెత్తున నిధులు వెచ్చించాలి. తద్వారా భారత సాయుధ బలగాలను అసమాన, అజేయ, ఆధునిక పోరాటశక్తిగా తీర్చిదిద్దాలి. గడచిన అయిదేళ్లలో అంతర్జాతీయ పోరాట రీతుల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. మన త్రివిధ బలగాలు వాడుతున్న ఆయుధాల్లో చాలాభాగం పాతబడిపోయాయి. సైనికులు, ఇతరత్రా రవాణాకు మనం ఇప్పటికీ పాత సోవియట్ విమానాలనే వాడుతున్నాం. ఆధునిక యుద్ధాల్లో అవి సమర్థంగా పనిచేస్తాయన్న భరోసా లేదు. ఇవాళ వందల కోట్ల డాలర్ల విలువైన ఫైటర్, బాంబర్ విమానాలకన్నా చవక డ్రోన్ల వినియోగమే ఎక్కువగా ఉంటోంది. యుద్ధంలో డ్రోన్లను కోల్పోయినా వెంటనే పెద్ద సంఖ్యలో వాటిని తయారుచేసి మోహరించవచ్చు. యుద్ధ విమానాలను అంత త్వరగా, అంత చవకగా మార్చేయడం కుదరదు. శత్రువుపై డ్రోన్లను ప్రయోగిస్తే సరిపోదు, వైరిపక్షం ప్రయోగించే డ్రోన్లు, క్షిపణులను మన భూభాగం వరకు రాకుండా మధ్యలోనే అడ్డుకుని పేల్చేయాలి. దానికి శక్తిమంతమైన నిరోధక వ్యవస్థలు అవసరం. మన డ్రోన్-క్షిపణి నిరోధ వ్యవస్థ ఇటీవల పాక్ దాడిని సమర్థంగా ఎదుర్కోగలిగింది. ఈ క్రమంలోనే డ్రోన్ల సమూహాన్ని నిర్వీర్యం చేసే సరికొత్త మైక్రో రాకెట్ వ్యవస్థ 'భార్గవాస్త్ర'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. యుద్ధంలో ఖర్చయిపోయే ఆయుధాల స్థానంలో ఎప్పటికప్పుడు కొత్తవాటిని సమకూర్చుకోవాలి. ఇందుకు ఆయుధ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు సరఫరా గొలుసులను పకడ్బందీగా ఏర్పాటు చేసుకోవాలి. దేశీయంగా తయారయ్యే ఆయుధాలనైతే పుష్కలంగా నిల్వ చేసుకోవచ్చు. గతంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే 2500 ఆయుధాలూ పరికరాలను ఇప్పుడు సొంతంగానే తయారు చేసుకోగలుగుతున్నాం. మరో 310 రక్షణ ఉపకరణాల స్వదేశీకరణ ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ప్రభుత్వం మొత్తం 36వేల ఆయుధ పరికరాలు, విడిభాగాలను దేశీయంగా ఉత్పత్తి చేయడానికి ప్రైవేటు పరిశ్రమలను ఆహ్వానించింది. ఆయుధోత్పత్తిలో 2032కల్లా స్వయంసమృద్ధం కావాలని భారత్ లక్షిస్తోంది. అది నెరవేరితే దేశ జీడీపీ పెరగడమే కాకుండా దండిగా ఉపాధి అవకాశాలూ అందివస్తాయి. కానీ, దేశార్థికంలో రక్షణ పరిశ్రమల వాటా ఇప్పటికీ తక్కువగానే ఉంటోంది.

నాణ్యతకు పెద్దపీట

భారత్ ఆయుధ ఉత్పత్తిలో అగ్రశక్తిగా నిలవాలంటే- ఆర్అండ్‌డీకి పెద్దయెత్తున నిధులు వెచ్చించి, భారీ సైనిక-పారిశ్రామిక పునాదిని నిర్మించుకోవాలి. రక్షణ రంగంలో చైనా తమకు పోటీ ఇస్తోందని అమెరికాయే ఆందోళన చెందుతోంది. ఈ సమయంలో, భారత్ ఏమాత్రం జాగు చేయకుండా స్వావలంబనకు నడుంకట్టాలి. భారీ పరిశ్రమలతో పాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమలనూ ఈ క్రతువులో భాగస్వాములను చేయాలి. కొన్ని రకాల ఆయుధాల తయారీలో 74శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను కేంద్రం ఆమోదిస్తోంది. భారత్‌లో కార్మిక, ఇతర వ్యయాలు బాగా తక్కువ కాబట్టి ఎస్-500 క్షిపణి ఛేదక వ్యవస్థలను స్థానికంగానే తయారు చేయడానికి రష్యా సిద్ధంగా ఉంది. సరైన ప్రమాణాల పాటింపుతో భారతీయ ఆయుధాలు నాణ్యతలో సాటిలేనివని నిరూపించాలి. దేశీయ పారిశ్రామికోత్పత్తి ఆశించిన స్థాయిలో పుంజుకోకపోయినా, ఆ లోటును రక్షణ పరిశ్రమల ద్వారా పూరించాలి.

# సోలార్ విద్యుత్‌దే భవిష్యత్



అనంతపురం, మన నేలపై ఉత్పత్తయ్యే విద్యుత్ రాష్ట్రానికే కాకుండా.. భారతదేశానికి మొత్తం సరఫరా చేస్తామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ సోలార్ ప్రాజెక్ట్ ద్వారా విద్యుత్ ఛార్జీలు తగ్గుతాయన్నారు. రెన్యువబుల్ ఎనర్జీ పరిశ్రమ మాత్రమే కాదు ఉద్యమం అని పేర్కొన్నారు. భారత క్లీన్ ఎనర్జీ విప్లవానికి శంకుస్థాపన చేశాం అని, ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీకి అనుగుణంగా ప్జాజెక్ట్ రూపకల్పన చేశామని చెప్పారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకొస్తామన్నారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్..సోలార్ ప్రాజెక్టుకు నారా లోకేశ్ భూమిపూజ చేశారు. 2,300 ఎకరాల్లో రూ.22వేల కోట్లతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఎపిలో పలు సంస్థలు పెట్టుబడి పెట్టడానికి సిఎం చంద్రబాబు బ్రాండే కారణమని మంత్రి లోకేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. రెన్యూ సంస్థ చైర్మన్, సీఈఓ సుమంత్ సిన్హా, తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ .... కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని అన్నారు. వివిధ సంస్థలు పెట్టుబడి పెట్టడానికి సిఎం చంద్రబాబు బ్రాండే కారణమని చెప్పారు. రాయలసీమలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటుతో 10 వేల మందికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నేలపై ఉత్పత్తయ్యే విద్యుత్ రాష్ట్రానికే కాకుండా ... దేశ అవసరాలకు కూడా ఉపయోగ పడనుందని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులతో విద్యుత్ ఛార్జీలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని లోకేష్ వెల్లడించారు. గత ప్రభుత్వం రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేకపోయిందని విమర్శించారు. ఒక్క పెట్టుబడి కూడా తీసుకురాలేకపోయారని అన్నారు. ప్రస్తుతం టాటా ఎనర్జీ, టీసీఎస్ సహా అనేక సంస్థలు పెట్టు-బడులు పెడుతున్నాయని లోకేష్ వివరించారు. డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులను వచ్చే నెలలో భర్తీ చేస్తామని లోకేష్ వివరించారు. వైసీపీ హయాంలో రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు కూడా రాలేదు. ఈ సోలార్ ప్రాజెక్ట్ ద్వారా విద్యుత్ చార్జీలు తగ్గుతాయి. మన ఆంధ్ర రాష్ట్రం నుంచి భారతదేశానికి మొత్తం మనమే విద్యుత్ సరఫరా చేస్తాం. గడచిన ఐదు సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్రంలో ఒక్క రోడ్డు వేయలేదు, రోడ్డుపై ఉన్న గుంతలను కూడా పూడ్చలేదు. రెన్యువబుల్ ఎనర్జీ పరిశ్రమ మాత్రమే కాదు.. ఉద్యమం. భారత క్లీన్ ఎనర్జీ విప్లవానికి శంకుస్థాపన చేశాం. ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీకి అనుగుణంగా ఎ÷-జాజెక్ట్ రూపకల్పన చేశాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే మా నినాదం. అనంతపురానికి కియా మోటార్ల పరిశ్రమ తెచ్చాం. మేక్ ఇన్ ఇండియా ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టు-బడులు తీసుకొస్తాం. వైసీపీ ప్రభుత్వం గత ఐదు సంవత్సరాల కాలంలో సర్వనాశనం చేశారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం భారీ విక్టరీ సాధించిన తర్వాత రాష్ట్రం పురోగతి సాధించిందని అన్నారు. రాయలసీమ ప్రకాశం జిల్లాలో సోలార్ గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దుతాం. భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీని కూడా రాయలసీమకు తీసుకొస్తాం. ఎన్డీఏ కూటమి 11 నెలలోనే సంక్షేమ పథకాలతో పాటు-అభివృద్ధిలో ముందుకు వెళుతున్నాం. ప్రజలు ఆశీస్సులు ఉంటే రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పునర్విభజన చేసిన తర్వాత రాజధాని ఎక్కడో తెలియదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని అమరావతిగా తీర్చిదిద్దుతున్నారు. 2019 నుంచి 24 వరకు వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేశారని మంత్రి నారా లోకేశ్ చెప్పుకొచ్చారు.

# రాజన్న ఆలయం అభివృద్ధిపై రచ్చ..!

వేములవాడ: 45ఏళ్ల తర్వాతా రూ. 76 కోట్లతో ఆలయ విస్తరణ పనులు చేపడుతుంటే స్వార్థ రాజకీయాల కోసం విపక్షాలు అడ్డుకుంటున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడుతున్నారు. పదేండ్ల పాటు అధికారంలో ఉండి కూడా బీఆర్ఎస్ ఆలయ విస్తరణ చేయలేదని, బీజేపీ కేంద్రం నుంచి ఒక్కపైసా తేలేదని విమర్శించారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధిపై రచ్చ హాట్ టాపిక్ గా మారింది. ఆలయాన్ని 100కోట్లకు పైగా వెచ్చించి అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతుంటే..అభివృద్ధి పేరుతో భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందంటూ విపక్షాలు, హిందూ సంఘాలు..ఆలయ పరిరక్షణ సమితి అభ్యంతరాలు లేవనెత్తుతున్నాయి. ఇప్పటికే ఆలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వేములవాడ పట్టణ బంద్ తో తమ నిరసన సైతం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఏమంటుందీ..?

తెలంగాణలో అతిపెద్ద ఆలయంగా ఉన్న రాజన్న ఆలయంలో 1979లో జరిగిన పనులే తప్ప అనంతరకాలంలో ఆలయ అభివృద్ధికి ఒక్క పని కూడా జరగలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015 జూన్ 18న కేసీఆర్ సీఎం హోదాలో వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ప్రతీ బడ్జెట్?లో రూ. 100 కోట్ల చొప్పున మొత్తం రూ. 400 కోట్లతో వేములవాడ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ)ని కూడా ఏర్పాటు వరకే పరిమితమయ్యారు. ఆలయంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఇదిగో అదిగో అంటూ పాలకులు ఊరిస్తున్న రాజన్న ఆలయ విస్తరణ పనులను పదేళ్ల తర్వాతా మేం చేస్తామంటూ కాంగ్రెస్? ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆలయ విస్తరణ పనులకు గతేడాది నవంబర్ 20న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆలయ విస్తరణ పనులకు వేములవాడ ప్రధాన అర్చకులు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాలయ ఈవో వినోద్ రెడ్డిలు, శృంగేరి పీఠాధిపతులు భారతి తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతి తీర్థ స్వామిలను కలిసి ఆలయ విస్తరణ కోసం ప్లాన్ రెడీ చేశారు. ఇందుకోసం ఇటీవల రూ. 76 కోట్లు విడుదల చేసింది. అలాగే నిత్యన్నదాన సత్రం నిర్మాణం కోసం మరో రూ. 35 కోట్లు కేటాయించింది. వచ్చే నెల నుంచి పనుల ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయంలో ప్రధానంగా నిత్య నివేదన మండపం, మహా మండపం, ఆలయ ప్రాకారాలు, నాలుగు రాజగోపురాలు, కోడెల విశ్రాంతి మందిరం, అభిషేక సంకల్ప మండలం, బ్రాహ్మణసత్రం, కల్యాణ మండపం, అద్దాల మండప నిర్మాణం, వేదాశీర్వచన మండపం, అనుస్థాన మండపం, ధర్మ గుండాన్ని పునఃనిర్మించడంతో పాటు క్యూలైన్లను విస్తరించాలని నిర్ణయించారు.

ఆలయ విస్తరణ తీరుపై అభ్యంతరాలు

ప్రధాన ఆలయంలో విస్తరణ పనుల కారణంగా భక్తులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో పక్కనే ఉన్న భీమేశ్వర ఆలయంలో దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన ఆలయంలో నిత్యపూజలు యథావిధిగానే కొనసాగిస్తూ, దర్శనాలను మాత్రం భీమేశ్వరాలయంలో కల్పించనున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. ఆలయ విస్తరణ సంకల్పం బాగానే ఉన్నప్పటికి విస్తరణ పనుల పేరుతో భక్తులకు రాజన్న దర్శనాలు నిలిపివేస్తామనడం సరికాదంటున్నారు. వచ్చే జూన్ 15నుంచి మూడేళ్ల పాటు భక్తులు లేకుండా పూజలు నిర్వహించడం వల్ల రాజన్న మొక్కులు..విశ్వాసాలు దెబ్బతింటున్నాయని ఆలయ పరిరక్షణ సమితి వాదిస్తుంది. దేశంలోని అయోధ్య, కాశీ, ఉజ్జయిని వంటి దేవాలయాల అభివృద్ధి సందర్భంగానూ భక్తులకు ఇబ్బందికి కల్గించలేదని..అదే రీతిలో ఇక్కడా కూడా దర్శన ఏర్పాట్లు చేయాలని ప్రతిపక్షాలు, ఆలయ పరిరక్షణ సమితి డిమాండ్ చేస్తుంది. అలాగే ఆలయ విస్తరణలో భాగంగా భక్తుల మనోభావాలు, విశ్వాసాలు దెబ్బతీసేలా 1100 సంవత్సరం నాటి పురాతన కోటిలింగాలను.. హిందూ దేవి దేవతలను తొలగించడాన్ని తప్పుబడుతుంది. అదే సమయంలో ఆలయం ప్రాంగణంలోని దర్గాను ఎందుకు తొలగించడం లేదన్న ప్రశ్నను లేవనెత్తుతున్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తు రాజన్న ఆలయ పరిరక్షణ సమితి పేరుతో బుధవారం పట్టణ బంద్ కూడా నిర్వహించారు. రాజన్న దర్శనాలను యథావిధిగా కొనసాగిస్తూనే అభివృద్ధి పనులు చేపట్టాలని, ఆలయ విస్తరణ పేరుతో ఎలాంటి విగ్రహాలను తొలగించవద్దని డిమాండ్ చేశారు. ఆలయ



అభివృద్ధి పనుల పేరుతో వేములవాడ ఆలయాన్ని మూసివేయాలని కాంగ్రెస్?సర్కారు ప్రయత్నిస్తోందని, విగ్రహాలను తొలగించే ప్రయత్నాలు చేస్తోందని ఈ సందర్భంగా ఆరోపించారు.

డీపీఆర్ ఎక్కడా..నిధులపై స్పష్టత ఏదీ ?

ఆలయ అభివృద్ధి డీపీఆర్ ప్రభుత్వం బహిర్గతం చేయలేదని.. నిధులు ఎక్కడి నుంచి వెచ్చిస్తారో చెప్పలేదని ప్రతిపక్షాలు, ఆలయ పరిరక్షణ సమితి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. అభివృద్ధి పనులకు నిధులపై వివరణ లేకుండానే గుడి దర్శనాలు మూసివేయడాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వమే నిధులు కేటాయించాలని..దేవాలయానికి సంబంధించిన ఆదాయ వనరులను ముట్టుకుంటే సహించేది లేదంటు అభ్యంతరాలు తెలుపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఓవైపు నిధులు లేవంటునే రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తామంటూ దర్శనాలు నిలిపివేయడంతపై సందేహాలు లేవనెత్తుతున్నారు. ప్రభుత్వం వద్ద నిధులుంటే ఇప్పటికే చెపట్టిన రాజన్న అనుబంధ ఆలయం బద్ది పోచమ్మ ఆలయ పనులు ఎందుకు నత్తనడక సాగుతున్నయంటూ ప్రశ్నిస్తున్నారు. నిధులపై స్పష్టత ఇచ్చి పట్టణంలోని ప్రముఖులు, కులసంఘాలతో చర్చించి వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని, నిధుల వివరాలు వెల్లడించాకే పనులు మొదలు పెట్టాలని చెబుతున్నారు. భక్తులకు ప్రధానాలయంలో దర్శనాలు, పూజలు యధావిధిగా కొనసాగిస్తునే ఆలయ అభివృద్ధి చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధిపై రాజకీయం తగదు

45ఏళ్ల తర్వాతా రూ. 76 కోట్లతో ఆలయ విస్తరణ పనులు చేపడుతుంటే స్వార్థ రాజకీయాల కోసం విపక్షాలు అడ్డుకుంటున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడుతున్నారు. పదేండ్ల పాటు అధికారంలో ఉండి కూడా బీఆర్ఎస్ ఆలయ విస్తరణ చేయలేదని, బీజేపీ కేంద్రం నుంచి ఒక్కపైసా తేలేదని విమర్శించారు. వాళ్లు చేయలేని ఆలయ అభివృద్ధి పనులను తాము చేస్తుంటే అడ్డుతగలడం అన్యాయమని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ లీడర్లు పట్టణ బంద్‌కు పిలుపునివ్వడంతో కాంగ్రెస్ నాయకులు కరపత్రాల ప్రచారంతో కౌంటర్ ఎటాక్ చేస్తున్నారు.

నిధులే లేనపుడు అభివృద్ధి ఎలా చేస్తారు..?

ప్రభుత్వం దగ్గర నిధులే లేవని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్న నేపథ్యంలో ఆలయ అభివృద్ధి ఎలా చేస్తారని ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ప్రశ్నించారు. రాజన్న ఆలయం మూసివేస్తే పరివార దేవతమూర్తుల విగ్రహాలను, కోటిలింగాలను తొలగించకూడదని డిమాండ్ చేశారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన ఎలాంటి మ్యాప్ ఇంకా విడుదల చేయకపోవడంతో ..విస్తరణ పనులు ఎలా చేస్తారన్నదానిపై భక్తుల్లో సందేహాలు నెలకొన్నాయన్నారు. 60 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వ్యక్తిగత ప్రతిష్ట కోసం పనిచేస్తున్నారు తప్పు.. రాజన్నపై భక్తితో కాదని విమర్శించారు.

శాస్త్రయుక్తంగానే ఆలయ విస్తరణ పనులు: వినోద్‌రెడ్డి, ఈవో

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ పనులు అగమాశాస్త్రం, శృంగేరి పీఠాధిపతుల అనుమతితోనే జరుగుతాయని ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. ఆలయాన్ని జూన్ 15న మూసి వేస్తామనడం అబద్ధం అని ఈవో వినోద్‌రెడ్డి చెప్పారు. రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులు జరిగే క్రమంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా భీమేశ్వర ఆలయంలో దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అక్కడ ఏర్పాట్లు పూర్తయ్యాక వేములవాడ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. రాజన్న ఆలయంలో పూజలు యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు.

# కుటుంబ బంధాలకు విలువేదీ?

విజయవాడ, ఏ వ్యక్తికైనా బలం... బలగం... తన కుటుంబం. కుటుంబం అంటే పెద్ద బలగం అని, స్నేహితులు, బంధువుల సమూహం అని అర్థం. ఇటీవల వచ్చిన బలగం సినిమా... కుటుంబ ప్రాధాన్యతని, కుటుంబంలోని వ్యక్తులంతా కలిసివుంటే...అదే బలగం అని చెప్పింది. మనం ఎంతగా కుటుంబానికి కట్టుబడి ఉంటున్నామో ఆలోచించాలి. ఒకరోజు గడిచిపోయింది. ఎక్కడా బంధాలపై పెద్దగా భావనకానరావడం లేదు. కేవలం పండగల సందర్భంలో హడావిడి చేస్తున్నాం. దీనిని అధిగించేందుకు గ్రామాల్లో పునాఇ ఉండాలి. అప్పుడే మన సంసారాలు బాగుడతాయి. నా ఇంటి పేరు ప్రపంచం/ ప్రజలే నా కుటుంబం/ వెదజల్లుతా దిగ్దిగంతం/ అభ్యుదయ సుగంధం అప్పుడు నా జీవితమే ఒక ప్రబంధం' అంటారు సినారె. సంతోషం, బాధ, దుఃఖం, ప్రేమ, అనుబంధాలు, కలహాలు, ఆత్మీయతలు ఇవన్నీ ఒకేచోట కలిసుండేదే కుటుంబం. భిన్న రకాల మనస్తత్వాలు, అభిప్రాయాలున్న వ్యక్తులను ఒకేచోట అనుబంధంగా మార్చేస్తుంది కుటుంబం. మన భారతీయ కుటుంబం.. అంతులేని శక్తికి, బలానికి సూచికగా నిలుస్తోంది. పిల్లల ఆనందాన్ని తమ సంతోషంగా భావించే తల్లిదండ్రులు, కన్నవారి కలలను సైతం నెరవేర్చాలనే తపన పిల్లలది. ఇలా ఎల్లప్పుడూ ప్రేమ ఆత్మీయతలతో కలిసుండేది ఫ్యామిలీ. ఇక మన భారతీయ సంప్రదాయంలో ఉమ్మడి కుటుంబాలు ప్రత్యేకం. మే 15అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం. మరి ఈరోజును ఎందుకు జరుపుకుంటారు.. 1983లో ఐక్యరాజ్య సమితి చూపు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుటుంబాల వైపు మళ్లింది. ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్, సోషల్ డెవలప్ మెంట్ కమిషన్ అప్పటి సెక్యూరిటీ జనరల్ కుటుంబాల సమస్యలు, వారి అవసరాల గురించి మరింత అవగాహన పెంచుకోవాలను కుంది. మే 29, 1985న ఆమోదించిన తీర్మానంలో కౌన్సిల్ సిఫారసు పై జనరల్ అసెంబ్లీ అభివృద్ధి పక్రియలో కుటుంబాలు అనే అంశాన్ని కూడా చేర్చారు. డిసెంబర్ 1989లో ప్రతి సంవత్సరం మే 15న జరుపుకునే అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ప్రకటించింది. ఉమ్మడి కుటుంబాల్లో వలె కలిసి మెలిసి ఉండే మనసు కానీ, మనుషులు కానీ లేకుండా పోయారు. పెండ్లయిన వెంటనే వేరు కాపురాలు పెట్టుకొని జంటలుగా ఉండి కూడా మొబైల్ ఫోన్ పట్టుకొని ఒంటరైపోతున్నారు. సలహాలిచ్చే పెద్దవారు లేక, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు రాక, బాధలను పంచుకునే బంధువులు లేక ఒంటరిగా మారుతున్నారు. చిన్న సమస్యలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇక్కడే ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యం తెలిసి వస్తున్నది. కుటుంబ వ్యవస్థతో మన సంస్కృతిని పిల్లలకు అందజేయడం, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం చేయాలి. ఇదే మానవీయ సమాజ ఉన్నతికి మూలం...అందుకు ప్రతి ఒక్కరూప్రతిన పూనాలి.

# సెలెబి సంస్థపై కేంద్రం వేటు

న్యూఢిల్లీ,భారత విమానాశ్రయాల్లో కీలక భద్రతా సేవలను అందజేస్తున్న తుర్కియే సంస్థ సెలెబి ఏవియేషన్‌పై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. జాతీయ భద్రత దృష్ట్యా, సెలెబి సంస్థకు ఇచ్చిన సెక్యూరిటీ క్లియరెన్స్‌ను తక్షణమే రద్దు చేస్తూ బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (%దీజూూ%) ఆదేశాలను జారీ చేసింది. పాకిస్థాన్‌కు తుర్కియే మద్దతుగా నిలవడం, ఆపరేషన్ సింధూర్ సమయంలో డ్రోన్లు, క్షిపణులు అందించడం వంటి చర్యలు దేశవ్యాప్తంగా ఆగ్రహానికి కారణం అయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు జమ్మూలో మాట్లాడుతూ.. జాతీయ భద్రతకు సంబంధించిన విషయాల్లో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. ఇది భద్రతాపరమైన అంశం. సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మంత్రి వ్యాఖ్యలు రామ్మోహన్ నాయుడు చేసిన కొన్ని గంటల్లోనే సెలెబి సంస్థపై వేటు పడింది. సెలెబి ఏవియేషన్.. భారత్‌లోని పలు విమానాశ్రయాల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 'సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియా' పేరుతో ఈ సేవలను అందజేస్తుంది. ఢిల్లీ విమానాశ్రయంలో కార్గో సేవలను 'సెలెబి దిల్లీ కార్గో టెర్మినల్ మేనేజ్‌మెంట్ ఇండియా' నిర్వహిస్తోంది. విమానాల రాకపోకలు, ప్రయాణికుల భద్రత, కార్గో నిర్వహణ వంటి కీలకమైన పనులను ఈ సంస్థ పర్యవేక్షిస్తుంది. ర్యాంప్ సర్వీసులు, లోడ్ కంట్రోల్, బోర్డింగ్ బ్రిడ్జిల అనుసంధానం, పోస్టల్, గోదాముల నిర్వహణ వంటివి ఈ సంస్థ బాధ్యతలు. ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే మద్దతుగా నిలవడం, డ్రోన్లు, క్షిపణులు అందించడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం ఊపందుకుంది. ట్రావెల్ ఏజెన్సీలు తుర్కియేకు బుకింగ్‌లు నిలిపివేశాయి. పలు విశ్వవిద్యాలయాలు ఆ దేశంతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకున్నాయి. తుర్కియే నుంచి దిగుమతి అయ్యే వస్తువులను నిషేధించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ నిర్ణయం భారత్-తుర్కియే సంబంధాలపై ప్రభావం చూపనుంది. భద్రతా పరమైన విషయాల్లో భారత్ ఎంత కఠినంగా ఉంటుందో ఈ చర్యలు స్పష్టం చేస్తున్నాయి.

# లభ్యం కాని మాజీమంత్రి కాకాణి ఆచూకీ

నెల్లూరు,మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. క్వార్జ్ కేసులో రెండు నెలలుగా కాకాణి తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో హైదరాబాద్, బెంగళూర్‌లో నెల్లూరు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాకాణి బంధువుల ఇళ్లు, ఫాంహౌజ్‌లలో గాలిస్తున్నారు. మరోవైపు క్వార్జ్ కేసులో మరో 12 మందికి పోలీసులు నోటీ-సులు ఇచ్చారు. క్వార్జ్ కేసులో మాజీ మంత్రి కాకాణి ఏ4గా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి గతంలో హైకోర్టును ఆశ్రయించి బెయిల్ పొందే ప్రయత్నాలు చేశారు. అయితే ఆ ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. దాంతో రెండు నెలలుగా మాజీ మంత్రి పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. హైదరాబాద్‌లో కొద్దిరోజులు, బెంగళూర్‌లో కొన్నాళ్లు ఉంటూ పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు-తెలుస్తోంది. కనీసం ఇంట్లో వాళ్లకు కూడా వాట్సప్ కాల్ మాట్లాడనట్లు-సమాచారం. నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో రెండు పోలీసు బృందాలు బెంగళూరులో పెద్ద ఎత్తున్న విస్తృతంగా జల్లెడపడుతున్నాయి. రి-టైర్డ్ ఐఆర్ఎస్ అధికారికి సంబంధించిన ఇళ్లల్లోనే కొంతకాలం వరకు తలదాచుకున్నట్లు- సమాచారం. దీంతో పోలీసులు అక్కడ కూడా తనిఖీలు చేపట్టారు. బెంగళూరులోని కాకాణి స్నేహితులు, బంధువులకు సంబంధించిన ఇళ్లు, ఫాంహౌజ్‌లు, గెస్ట్‌హౌజ్‌లలో కూడా పోలీసులు జల్లెపడుతున్నారు. కాకాణి కోసం గాలింపు ముమ్మరం చేశారు. మరోవైపు హైదరాబాద్‌లో కూడా రెండు పోలీసు బృందాలు కాకాణి కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ సాగిస్తున్నారు. ఈ క్రమంలో సుప్రజ అనే మహిళ అకౌంట్‌లోకి భారీ ఎత్తున కోట్లాది రూపాయలు ట్రాన్సాక్షన్స్ జరిగినట్లు- గుర్తించారు. ఆమె ఇంటికి కూడా పోలీసులు వెళ్లి నోటీ-సులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. అయితే ఆమె నోటీ-సులు తీసుకోకపోవడంతో ఇంటి గోడకు నోటీ-సులు అంటించారు. అలాగే ఈ కేసులో 12 మందిని పోలీసులు గుర్తించారు. అందులో కాకాణి అల్లుడు కూడా ఉన్నారు. వీరందరికీ నోటీ-సులు ఇచ్చేందుకు వెళ్లగా.. వారు లేకపోవడంతో ఇంటి గోడలకు నోటీ-సులు అంటించి వస్తున్నారు. రెండు మూడు సార్లు నోటీ-సులు ఇచ్చాక వారు స్పందించకపోతే వారందరినీ కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

# అవినీతి నేతలకు చిప్పకూడు తప్పదు

చిత్తూరు,ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారంతా జైలుకు పోతారని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రంలో ఉండే భూములు మొత్తం దోచుకున్నారని అన్నారు. త్వరలోనే వైఎస్ జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా సహా అంతా జైలుకు వెళ్లవలసిన వారునని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులు చేసిన పంది కొక్కులన్నీ ఇప్పుడు బయటకు వస్తున్నాయని విమర్శించారు. పెద్దిరెడ్డి అడవిని ఆక్రమించుకొని గెస్ట్ హౌస్‌లు కట్టుకున్నారు, రోడ్లు వేసుకున్నారని మండిపడ్డారు. రోజా డైలాగులు సినిమాలో పనికి వస్తాయని, రాజకీయాల్లో కాదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి విమర్శించారు. చిత్తూరులో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... 'త్వరలోనే వైఎస్ జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా సహా అవినీతి చేసిన అందరూ జైలుకు పోతారని అన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రంలో ఉండే భూములు మొత్తం దోచుకున్నారని, గత ప్రభుత్వ హయాంలో తప్పులు చేసిన పంది కొక్కులన్నీ ఇప్పుడు బయటకు వస్తున్నాయి. పెద్దిరెడ్డి అడవిని ఆక్రమించుకొని గెస్ట్ హౌస్‌లు కట్టు-కున్నారు, రోడ్లు వేసుకున్నారు అటవీ భూఅక్రమ జరిగింది కాబట్టి అందరి మీద కేసులు నమోదు చేశాం. తప్పు చేసిన వారికి వయసుతో సంబంధం ఏం ఉంది?. 60 ఏళ్లు దాటాయి కాబట్టి.. తప్పు చేసినా, అవినీతి చేసినా వదిలేయాలా?. తప్పులు చేశారు కాబట్టే 10 గంటలు, 15 గంటలు కాదు.. ఎన్ని గంటలైనా విచారిస్తారు' అని అన్నారు. 75 ఏళ్ల చంద్రబాబు నాయుడుపై ఒక దొంగ కేసు పెట్టి 50 రోజులు జైల్లో పెట్టింది వైసీపీనే కదా?. మేము ఏమీ రోడ్డు మీద పోయో వారిని ఎవరినీ విచారించలేదు. ఆర్కే రోజా డైలాగులు సినిమాలో పనికి వస్తాయి, రాజకీయాల్లో అస్సలు పనికిరావు. సినిమా డైలాగులు చెప్పి చెప్పి రోజా నలబై వేల ఓట్లతో ఓడిపోయింది. మీరు చేసిన తప్పులకు శిక్ష అనుభవించాల్సిందే' అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నేతలపై వరుస కేసులు నమోదవుతున్న విషయం తెలిసిందే.

# వల్లభనేని వంశీపై మరో కేసు

విజయవాడ, వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై మరో కేసు నమోదైంది. గన్నవరం నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని వంశీపై కేసు నమోదైంది. మైనింగ్ ఏడీ గన్నవరం పోలీసు స్టేషన్‌లో వంశీపై పిర్యాదు చేశారు. అక్రమ తవ్వకాలపై నివేదికను ఆయన పోలీసులకు అందించారు. 2019-2024 సమయంలో వంశీ, ఆయన వర్గం అక్రమాలపై పాల్పడినట్టు- నివేదికలో పేర్కొన్నారు. 100 కోట్ల పైన అక్రమాలకు పాల్పడ్డారని వంశీపై మైనింగ్ ఏడీ ఫిర్యాదు చేశారు. మైనింగ్ ఏడీ ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. వంశీ సహా 8 మందిపై కేసు నమోదైంది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీ ఇప్పటికే విజయవాడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈరోజు బెయిల్ పిటిషన్‌పై విజయవాడ కోర్టులో తీర్పు రానుంది. ఈ కేసులో బెయిల్ వచ్చినా.. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ విధిస్తే వంశీకి మరలా జైలు తప్పదు. ఇది చాలదన్నట్టు- నేడు మరో కేసు నమోదయింది. ప్రస్తుతం వంశీపై మూడు కేసులు ఉన్నాయి. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి, నకిలీ ఇళ్ల పట్టాల కేసు, అక్రమ మైనింగ్ కేసులు ఆయనపై ఉన్నాయి.

# మళ్లీ కోవిడ్..

న్యూఢిల్లీ,ఆసియా ఖండంలో కోవిడ్-19 మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. హాంకాంగ్, సింగపూర్ వంటి జనసాంద్రత అధికంగా ఉన్న నగరాల్లో కేసులు వేగంగా పెరుగుతున్నాయి. వేడి వాతావరణం సానుకూలంగా ఉన్నప్పటికీ, వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. దీనితో ఆరోగ్య అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ కొత్త వేవ్‌తో ఆసుపత్రుల్లో చేరికలు, తీవ్రమైన కేసులు, కొన్ని ప్రాంతాల్లో మరణాలు కూడా నమోదవుతున్నాయి. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులు బూస్టర్ డోసులు తీసుకోవాలని, ప్రజలు తమ టీకాలను తాజాగా ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

హాంకాంగ్‌లో కోవిడ్ వేగవ్యాప్తి

హాంకాంగ్‌లో కోవిడ్-19 కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి, ఇది 7 మిలియన్లకు పైగా జనాభా ఉన్న ఈ నగరంలో ఆందోళన కలిగిస్తోంది. హాంకాంగ్ సెంటర్ ఫర్ హెల్త్ ప్రొటెక్షన్ (సీహెచ్‌పీ) కమ్యూనికబుల్ డిసీజ్ బ్రాంచ్ చీఫ్ ఆల్బర్ట్ ఆయు ప్రకారం, మే 3 నుంచి ఒక వారంలో కోవిడ్ పాజిటివిటీ రేటు ఈ ఏడాదిలో అత్యధిక స్థాయికి చేరింది. ఈ వారంలో 31 తీవ్రమైన కేసులు, మరణాలతోసహా నమోదయ్యాయి. ఇది గత రెండేళ్లతో పోలిస్తే తక్కువ అయినప్పటికీ, వైరల్ లోడ్, ఆసుపత్రిలో చేరికలు గణనీయంగా పెరిగాయి. జనసాంద్రత అధికంగా ఉన్న ఈ నగరంలో వైరస్ వ్యాప్తి వేగంగా ఉండటం, సామాజిక దూరం, మాస్క్ ధరించడం వంటి జాగ్రత్తలను తిరిగి అమలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

సింగపూర్‌లో కేసుల పెరుగుదల..

సింగపూర్‌లో కూడా కోవిడ్-19 కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. మే 3 నుంచి ఒక వారంలో కేసుల సంఖ్య 28% పెరిగి 14,200కు చేరగా, రోజువారీ ఆసుపత్రి చేరికలు 30% పెరిగాయి. సింగపూర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ దాదాపు ఒక సంవత్సరం తర్వాత ఈ డేటాను విడుదల చేసింది, జనాభాలో రోగనిరోధక శక్తి తగ్గడం, కొత్త వేరియంట్లు వంటి కారణాలు ఈ పెరుగుదలకు దోహదపడినట్లు తెలిపింది. అయితే, 2020-21 మహమ్మారి సమయంలో కంటే తీవ్రమైన కేసులు లేదా విస్తృత వ్యాప్తి సూచనలు లేవని స్పష్టం చేసింది. సింగపూర్ అధికారులు ప్రజలను బూస్టర్ డోసులు తీసుకోవాలని, రద్దీ ప్రదేశాల్లో మాస్క్ ధరించాలని సూచిస్తున్నారు.

చైనాలో కోవిడ్ వేవ్ గరిష్ట స్థాయి వైపు

చైనాలో కూడా కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి, దీనిని చైనీస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీసీడీసీ) నిశితంగా గమనిస్తోంది. మే 4 వరకు ఐదు వారాల్లో ప్రధాన ఆసుపత్రులలో పాజిటివిటీ రేటు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగింది. ఇది గత వేసవిలో నమోదైన గరిష్ట స్థాయివైపు సాగుతోంది. చైనా యొక్క జీరో కోవిడ్ విధానం ముగిసినప్పటికీ, కొత్త వేరియంట్ల వ్యాప్తి, రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల కేసులు పెరుగుతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా అధికారులు టీకా కార్యక్రమాలను ముమ్మరం చేయడం, ఆసుపత్రి సౌకర్యాలను సిద్ధం చేయడం వంటి చర్యలను చేపడుతున్నారు.

సామాజిక, ఆర్థిక ప్రభావాలు

ఈ కొత్త వేవ్ సామాజిక, ఆర్థిక రంగాలపై కూడా ప్రభావం చూపుతోంది. హాంకాంగ్ గాయకుడు ఈసన్ చాన్ కోవిడ్ బారిన పడటం వల్ల తైవాన్‌లోని కావోసియుంగ్‌లో షెడ్యూల్ అయిన కచేరీలను రద్దు చేయాల్సి వచ్చింది, ఇది సాంస్కృతిక కార్యక్రమాలపై వైరస్ ప్రభావాన్ని చూపిస్తుంది. సింగపూర్‌లో ఆసుపత్రి చేరికలు పెరగడం వల్ల ఆరోగ్య వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది, ఇది ఆర్థిక కార్యకలాపాలపై, ముఖ్యంగా పర్యాటకం, వాణిజ్య రంగాలపై ప్రభావం చూపవచ్చు. చైనాలో కేసుల పెరుగుదల, సప్లై చైన్‌లపై, అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది, ఎందుకంటే చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుంది.

# అకాల వర్షాలతో కుదేలు !



హైదరాబాద్,ఏ ప్రభుత్వం వచ్చినా అన్నదాతలను ఆదుకోవడం లేదన్నది అర్థం అయ్యింది. అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు లబోదిబోమంటున్నా అధికారులు మాత్రం రైతుల వద్దకు వెళ్లడం లేదు. మార్కెట్ కమిటీలు ఉన్నా ఉత్తిదే అని తేలింది. మంత్రులు ప్రకటనలకే పరిమితం అయ్యారు. ఇటీవల ధాన్యం అకాల వర్షాలకు పూర్తిగా తడిసిపోయింది. అలాగే ధాన్యం కొనుగోళు చురుకుగా సాగడం లేదు. గత ప్రభుత్వం ప్రచారార్భాటం చేసిందే తప్ప కొనుగోళ్లపై చిత్తశుద్ధి ప్రకటించలేదు. ఇప్పుడేమో ధర్నాలు, ఆందోళనలకు బిఆర్ఎస్ పిలుపునివ్వడం సిగ్గుచేటు. ఇకపోతే కాంగ్రెస్ కూడా అదే దారిలో నాడుస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కెటింగ్ సిబ్బందిని పంపి ధాన్యం మొత్తాన్ని కొనేలా ప్రణాళికలు సిద్ధం చేయలేదు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడం అన్నదాతలకు కష్టంగా మారింది. ఇప్పటికే ధరల హెచ్చు తగ్గులతో తీవ్రంగా నష్టపోతుండగా, పంటను అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. వరి, వేరుశనగ, జొన్న,మక్క జొన్న ఇలా పంట ఏదైనా కొనుగోళు సక్రమంగా లేవు. మిల్లుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. కొన్నిచోట్ల రైతులు మార్కెట్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు ఫిర్యాదు చేయగా వ్యాపారులను అడగాలని సూచించారు. రైతులు మిల్లుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలని కోరగా కొందరు నిరాకరించారు. ఓ వైపు మబ్బులు కమ్ముకొస్తున్న వేళ ఉదయం నుంచి సాయంత్రం వరకు చూసి ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో చేసేదేమీ లేక జిల్లాల్లో వేరుశనగ రైతులు మళ్లీ బస్తాల్లో నింపుకొని ఇళ్లకు తీసుకెళ్లారు. పంట పండించడం ఒక ఎత్తయితే పంట అమ్ముకోవడం మరో ఎత్తవుతున్నది. మార్కెట్‌లో వేరుశనగను ఎవరూ ఖరీదు చేయకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మిల్లుల వద్దకు వెళ్లి అడిగితే తక్కువ ధరకు కొంటామంటున్నరు. ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సి ఉండగా, 5 క్వింటాళ్లే వచ్చింది. దిగుబడి తగ్గి నష్టపోగా, ధర లేకపోవడం, వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో సాగుచేయడం భారంగా మారుతోంది. పెట్టిన పెట్టుబడి రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. మద్దతు ధర చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైంది. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో అకాల వర్షానికి వడ్ల బస్తాలు తడిసి ముద్దయ్యాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం తూకం వేయకుండా, తూకం వేసిన ధాన్యం తరలించకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడుస్తున్నదని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాల సంఖ్య పెంచి లారీల కొరత తీరుస్తామని హామీ ఇవ్వాలని కోరుతున్నారు. తామే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం పది రోజుల నుంచి తూకం చేయడం లేదు. సొసైటీ వాళ్లను అడిగితే రైస్‌మిల్లర్లు వద్దని చెబుతున్నారని సమాధానం ఇస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి మా రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ధాన్యం కొనకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసింది. మొలకలు వస్తున్నాయి. అధికారులు స్పందించి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాల్సి ఉంది. ఇకపోతే ఇటీవల కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. పలు గ్రామాల రైతులు విక్రయానికి తీసుకొచ్చిన జొన్నలతోపాటు తూకం వేసిన జొన్న బస్తాలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చామని, తూకం వేసిన అనంతరం లారీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని రైతులు తెలిపారు. జొన్న బస్తాలను తరలించేందుకు ఒక్కో బస్తాకి రూ.10-రూ.20 తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రం అంతటా ఇదే దుస్థితి నెలకొంది. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు ఊరట కల్పించాల్సి ఉంది. ఇకపోతే గత నాలుగేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతన్నలకు వాతావరణశాఖ శుభవార్త అందజేసింది. ఈ ఏడాది ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉంది. మే 27ననే నైరుతి రుతుపవనాలు రానున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.. వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రుతుపవనాల సీజన్‌లో 106 శాతం వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేసింది. ఆగస్టు-సెప్టెంబరు నాటికి ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చని వెల్లడించింది. వాయవ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. గతేడాది నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యం కావడంతోపాటు..దేశంలోనూ వివిధ ప్రాంతాలకు ఆలస్యంగా విస్తరించడంతో తొలకరి జల్లుల కోసం రైతులు కళ్లు కాయలు కాసే వరకు ఎదురు చూశారు. పైగా నైరుతి రుతుపవనాల ప్రభావం కూడా తొలినాళ్లలో పెద్దగా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండుతున్న ఎండాకాలం ప్రజలందరికీ వాతావరణశాఖ చల్లటి కబురు పంపింది. నైరుతి రుతుపవనాలు ఇప్పటికే అండమాన్‌ను తాకాయి. ఇప్పటికే వర్షాలు లేక జలాశయాలన్నీ ఖాళీ అయ్యాయి. రుతుపవనాలు రాకతో విస్తరంగా వర్షాలు కురవనున్నాయి. సరైన సమయంలో రుతుపవనాలు పలకరిస్తే....సకాలంలో పంటలు వేయడం వల్ల ఆ తర్వాత వచ్చే తుపాన్‌లు, వరదల నుంచి పంటను కాపాడుకునే అవకాశం ఉంది. వాతావరణశాఖ తెలిపిన చల్లని కబురుతో రైతుల ముఖంలో వెలుగులు నిండాయి. ఇప్పటికే పంటపొలాలను సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మనదేశంలో నైరుతి రుతుపవనాల వల్లే విస్తరంగా వర్షాలు కురుస్తాయి. వర్షాధార పంటలకూ ఇవే ఆధారం. దేశంలో జూన్, జులై నెలలో పడే వర్షాలే అత్యంత కీలకం. సాధారణంగా నైరుతి రుతుపవనాలు కొంచెం అటు, ఇటుగా జూన్ తొలివారంలోనే దేశంలోకి ప్రవేశిస్తాయి.

# పథకాల అమలులో జాప్యమే కాంగ్రెస్ సర్కార్‌కు డేంజర్ బెల్?

హైదరాబాద్,ఎన్నికల సమయంలో భావోద్వేగాలు కొంతకాలానికి చల్లబడతాయి. అదే స్థానంలో ఇచ్చిన హామీల అమలు ఎంత వరకూ వచ్చిందనే చర్చలు చోటు చేసుకుంటాయి. అందులోనూ ఒక ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించి మరీ గెలిపించుకున్న ప్రభుత్వంపై ఆకాంక్షలు మరింత భారీగా ఉంటాయి. ప్రత్యేకించి పథకాల కోసం ఎదురుచూసేవారు.. ఏ మాత్రం జాప్యాన్ని సహించలేని స్థితిలోనే ఉంటారు. అలాంటి పరిస్థితిని కల్పిస్తున్నది కూడా రాజకీయ పార్టీలే. సరిగ్గా ఇలాంటి పరిస్థితినే కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. అది కూడా కాస్త తీవ్ర స్థాయిలోనే!కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిపోయింది. కానీ.. ఇచ్చిన హామీల అమలు మాత్రం అలానే పడి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి వెంటనే ఖర్చులేని ఆరోగ్య శ్రీ పెంపు లేదా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటివాటికంటే.. నగదు రూపంలో లభించాల్సిన సహాయాల కోసం రాష్ట్రంలోని పేదలు ప్రజలు ఎదురు చూస్తున్నారు. సహజంగానే ఇదే అంశం ఏ నలుగురు రచ్చబండ మీదకు చేరినా చర్చనీయాంశం అయిపోతున్నది. ఈ చర్చల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మీద వ్యతిరేకత కనిపిస్తున్నదనే అభిప్రాయాలను రాజకీయ పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా మూడున్నరేళ్లు అధికారంలో ఉండనున్నది. అయినా.. అప్పుడే వ్యతిరేక సంకేతాలు ఎందుకు వస్తున్నాయన్న విషయంలో రాజకీయ పరిశీలకులు తలో విధంగా స్పందిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా వివిధ రంగాలకు చెందిన వారంతా ఊపిరి పీల్చుకున్నారు. తమకు స్వేచ్ఛ వచ్చిందని చెప్పుకొన్నారు. స్వేచ్ఛ వచ్చింది.. ఏదైనా అడిగే శక్తిని రేవంత్ సర్కారు ఇచ్చింది కానీ.. ఇచ్చిన వాగ్దానాలను సకాలంలో ఎందుకు అమలు చేయడం లేదన్న చర్చ బలంగా వినిపిస్తున్నది.

పథకాలే డేంజర్ బెల్స్

బీఆరెస్ 2023 డిసెంబర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలు కావడానికి ధరణి ఏ విధంగా కారణం అయిందో.. ఇప్పుడు రేవంత్‌కు అదే ప్రమాదం పథకాల అమలులో జాప్యంతో ఎదుర్కొనే అవకాశాలు ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలు ఇంకా అమల్లోకి రాలేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరెంటు, ఆసరా పెన్షన్లు, తాగునీరు, సాగునీరు, రైతుబంధు, రైతు బీమా, అన్నింటికి మించి ధాన్యం కొనుగోళ్లలో ప్రజలు నూటికి నూరు మార్కులు ఇచ్చారు. ఇవన్నీ సకాలంలో సక్రమంగా సాగిపోయేవని గుర్తు చేస్తున్నారు. కేసీఆర్ ఎక్కడి నుంచి వాటికి డబ్బు తెచ్చారనేది తమకు అనవసరమని, కానీ వాటిని మాత్రం ఠంచన్‌గా అమలు చేసేవాడన్న చర్చల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నది. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. మాట ఇస్తే మడమ తిప్పలేదన్న అభిప్రాయం సర్వత్రా ఉండేది. ఉచిత కరెంటు, ఆరోగ్య శ్రీ .. ఈ రెండు పథకాల అమలు వైఎస్‌కు అపారమైన పేరు తెచ్చిపెట్టాయి. కానీ.. పథకాల అమల్లో రేవంత్ సర్కార్ మాత్రం విఫలమైనట్టే కనిపిస్తున్నదని ప్రజలు పోల్చుకుంటున్నారు. ప్రజలకు నేరుగా కనెక్ట్ అయిన వాగ్దానాలను అమలు చేయడంలో రేవంత్ సర్కారు ఫెయిల్ అయిందన్న విమర్శలు గ్రామ స్థాయిలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇది అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పెరుగుతున్న వ్యతిరేకతగా పరిశీలకులు భావిస్తున్నారు. వాస్తవానికి ఎన్నికల ముందు రైతు బంధు కింద జమచేసేందుకు సుమారు ఏడువేల కోట్ల రూపాయలను నాటి బీఆరెస్ ప్రభుత్వం సిద్ధం చేసిన నిధులు.. కోడ్ కారణంగా చెల్లింపుల దాకా వెళ్లలేదు. ఫలితాలు వచ్చిన వెంటనే ఆ డబ్బు జమ చేస్తానని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ తొలిరోజుల్లోనే తేలిపోయింది. ఏం జరిగిందో తెలియదు కానీ.. ఆ సొమ్మును కాంట్రాక్టర్లు తమ ఖాతాల్లోకి వేయించుకున్నారన్న చర్చల అప్పట్లో నడిచింది. ఆ తర్వాత కూడా రైతు భరోసా పేరిట నిధులను రైతుల




ఖాతాల్లో జమ చేయక పోవడంతో ఆనాడే రైతాంగం నుంచి కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత వచ్చింది. రైతు బీమా కూడా అమలవట్లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రైతు రుణమాఫీ చేసి కూడా రేవంత్ సర్కారు విమర్శల పాలైంది. అధికారుల రాంగ్ గైడెన్స్ ఉందా? లేక బ్యాంకర్లు తప్పు దారి పట్టించారా? అనేది పక్కన బెడితే రెండు లక్షల రుణమాఫీ కుటుంబంలో ఒక్కరికి అనేదే రాంగ్ అన్న చర్చ రాష్ట్ర రైతాంగంలో జరుగుతోంది. వివిధ టెక్నికల్ కారణాలు చూపి ఈ పథకాన్ని సరిగ్గా అమలు చేయలేదన్న విమర్శలూ ఉన్నాయి. గ్రామాలలో ఒక పథకంలో ఒకరికి లబ్ది జరిగితే లబ్ది జరిగిన వాడు బయటకు చెప్పడు కానీ.. వివిధ కారణాల చేత లబ్ది పొందని వ్యక్తి దానిని మొత్తం గ్రామ సమస్యగా మార్చుతాడు. సరిగ్గా రేవంత్ సర్కార్ విషయంలోనూ ఇదే జరిగిందని అంటున్నారు.

నాడు నీళ్లొచ్చాయి.. మరి నేడు?

తాగునీరు. సాగు నీరుకు సంబంధించిన చర్చ కూడా జోరుగానే సాగుతున్నది. కేసీఆర్ ఏం చేసిండో తెలియదు కానీ కాలువ చివరి తూము వరకు నీళ్లు ఇచ్చాడని పలువురు రైతులు చెబుతున్నారు. ఇదంతా కాళేశ్వరం ఘనతగా కేసీఆర్, నాటి మంత్రులు ప్రచారం చేశారు. కేసీఆర్ ఫామ్ హౌజ్‌లోనే ఉన్నా.. మంత్రులు, ఎమ్మెల్యేలను చెరువు గట్ల వెంట తిప్పేవారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కాళేశ్వరం లేకున్నా నీళ్లు ఇచ్చారు కానీ సరిగ్గా మానిటరింగ్ చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగానే.. పంట చేతికి వచ్చే సమయానికి నీళ్లు సరిగ్గా అందక అనేక చోట్ల పంటలు ఎండి పోయాయని అంటున్నారు. ఇది కూడా రైతుల్లో ఆగ్రహం రాజేస్తున్నది.

చెప్పినంత పెంచక..

ఆసరా పెన్షన్లు కూడా ఇచ్చిన హామీ ప్రకారం పెంచలేదన్న చర్చ సర్వత్రా జరుగుతున్నది. సకాలంలో పెన్షన్లు అందక పోవడం ఒక ఎత్తు అయితే.. చెప్పిన మాట ప్రకారం పెంచకపోవంతో కూడా ఈ వర్గాలలో రేవంత్ సర్కారుపై వ్యతిరేకత ప్రబలేందుకు ఒక కారణంగా కనిపిస్తున్నదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

చేసినవి చెప్పుకోలే..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ధరణి స్థానంలో భూ భారతిని తీసుకువచ్చింది. కానీ అమలు మాత్రం నత్తను తలపిస్తుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అలాగే భారత దేశానికి దిక్సూచిగా మారిన కులగణను రేవంత్ సర్కారు దిగ్విజయంగా చేపట్టి అమలు చేసింది. దీనిని చూసే దేశవ్యాప్త కుల గణనకు ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారని కాంగ్రెస్ నాయకులు చెప్పుకొంటున్నారు. ఇలా దేశానికి ఆదర్శమైన సంస్కరణలు తీసుకొచ్చిన రేవంత్ సర్కార్.. ప్రజలకు నేరుగా కనెక్ట్ అయిన పథకాల అమల్లో మాత్రం తీవ్ర జాప్యం చేస్తుండటం ప్రధాన మైనస్‌గా మారుతున్నదనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా రేవంత్ సర్కారు ప్రజలకు నేరుగా కనెక్ట్ అయిన పథకాల అమలుపై కేంద్రీకరించాలని, దీంతో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రజల వద్దకు వెళ్లేలా చేయాలని రాజకీయ పరిశీలకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేయోభిలాషులు అంటున్నారు.

# స్మార్ట్ పోల్స్ వినియోగంపై దృష్టి సారించాలి

హైదరాబాద్,వచ్చే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సబ్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. విద్యుత్‌శాఖపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్ మారబోతోంది. విద్యుత్ లైన్ల ఆధునికీకరణపై దృష్టి సారించాలి. ఫ్యూచర్‌సిటీలో పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ విద్యుత్ టవర్లు, లైన్లు, స్తంభాలు కనిపించకూడదు. గ్రేటర్ పరిధిలో స్మార్ట్‌పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఓఆర్‌ఆర్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరినట్లు-అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025-26లో విద్యుత్ డిమాండ్ 18,138 మెగావాట్లకు పెరుగుతుందని, 2034-35 నాటికి విద్యుత్ డిమాండ్ 31,808 మెగావాట్లకు చేరుతుందని అధికారులు వివరించారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎంకి అధికారులు వివరించారు. గత ఏడాదితో పోల్చితే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగింది అన్నారు. 2025-26లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగు తుందని అంచనా వేశారు. 2034-35 నాటికి 31,808 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు- ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది అన్నారు. విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలి.. రైల్వే లైన్లు, మెట్రో, ఇతర మాస్ ట్రాన్స్ పోర్టులకు విద్యుత్ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు- ఇతర కార్పొరేషన్లలో విద్యుత్ అవసరాలను లెక్కలోకి తీసుకోవాలి.. కొత్తగా ఏర్పాటు- చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ ను దృష్టిలో పెట్టు-కుని ముందుకు కొనసాగాలని చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్ గా మారబోతుంది.. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నా మని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్‌ఎండీఏతో సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలన్నారు. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైనా దృష్టి సారించాలి.. ఫ్యూచర్ సీటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు- చేయాలని ఆయన తెలిపారు. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదు.. హై టెన్షన్ లైన్లను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు- చేయాలని సూచించారు. అలాగే, సెక్రటె-రియట్, నెక్లస్ రోడ్, కేబీఆర్ పార్కు లాంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను అందుబాటులోకి తీసుకు రావాలని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# హరీష్ రావు నివాసానికి కెటిఆర్

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా, మాజీ మంత్రి, సిద్ధిపేట్ ఎమ్మెల్యే హరీశ్ రావు నివాసానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు- హరీష్ రావుతో సమావేశం అయినట్లు- తెలుస్తుంది. తాజా రాజకీయలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. దీంతో పాటు హరీష్ రావు తండ్రి ఆరోగ్య పరిస్థితిని కూడా కేటీఆర్ అడిగి తెలుసుకున్నట్లు- తెలుస్తుంది. అయితే, మరోవైపు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు ప్రయాణమై వెళ్ళనున్నారు. తన కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమం కోసం ఆమె అమెరికాకు వెళ్తున్నారు. ఇప్పటికే యూఎస్ లో కవిత భర్త అనిల్ ఉన్నారు. ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఇటువంటి సమయంలో కేటీ-ఆర్, హరీశ్ రావు సమావేశం కావడం పార్టీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతుంది. కాగా శుక్రవారం ఉదయం మాజీ మంత్రి హరీష్‌రావు నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు.

# కొత్త ప్రతిపాదన?

తిరుమల: ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల రద్దీ నెలకొంది. మంగళవారం నాడు 74,020 మంది భక్తులు శ్రీవారి దర్శించుకున్నారు. వారిలో 31,190 మంది తలనీలాలు సమర్పించారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆ ఒక్కరోజే హుండీ ద్వారా 3.27 కోట్ల రూపాయల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందింది.వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లల్లో భక్తులు వేచివున్నారు. టోకెన్ లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి 8 నుంచి 10 గంటల సమయం పట్టింది. కంపార్ట్‌మెంట్లు, క్యూ లైన్లల్లో ఉన్న వారికి టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులు అల్పాహారం, పాలు, మంచినీరు పంపిణీ చేశారు.తిరుమల భద్రతపై టీటీడీ పాలకమండలి పలు నిర్ణయాలను తీసుకుంది. ప్రతి రోజూ దేశం నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు సందర్శించే పవిత్ర పుణ్యక్షేత్రం కావడం వల్ల భద్రతపరంగా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని భావిస్తోంది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడు సంతృప్తికరంగా తిరిగి వెళ్లేలా చర్యలు చేపట్టింది.దీనిపై చర్చించడానికి అత్యున్నత సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది టీటీడీ పాలకమండలి. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఏర్పాటైన ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షెముషి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడారు. ఇటీవల పహల్గామ్ ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో తిరుమల ఆలయంలో భద్రతను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించామని, ఇందులో భాగంగా సెక్యూరిటీ ఆడిట్ చేపట్టామని పేర్కొన్నారు. అన్ని భద్రతా దళాలు, టీటీడీ విభాగాల సమన్వయంతో పనిచేస్తూ, భక్తుల మనోభావాలను కాపాడటానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.2023 మేలో నిర్వహించిన భద్రతా ఆడిట్, నాటి సమీక్షలో చేసిన ప్రతిపాదనలు, పహల్గామ్ ఉగ్రవాద దాడి అనంతరం నెలకొన్న పరిస్థితుల ఆధారంగా చేపట్టాల్సిన మార్పులు, టీటీడీ తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై ఇన్‌ఛార్జి సీవీఎస్వో, తిరుపతి అర్బన్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ హర్షవర్ధన్ రాజు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోం గార్డులు, సివిల్ పోలీసు, టీటీడీ భద్రతా సిబ్బంది వంటి అన్ని భద్రతా దళాలను సమన్వయ పరచి ప్రతి ఒక్క దళానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ రూపొందించాల్సిన అవసరం ఉందని డీఐజీ పేర్కొన్నారు.


# అమెరికాకు కవిత వెనుక గుసగుసలు.. సడన్‌గా వెళ్లడం వెనుక



హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీలో లీడర్ షిప్ ఫైటింగ్ ఎంతవరకు వచ్చింది? కావాలనే ఎమ్మెల్సీ కవితను సైడ్ చేశారా? కనీసం ఆమెకు ఏ పోస్టు ఇవ్వమని తెగేసి చెప్పేశారా? జరుగుతున్న పరిణామాలు పార్టీని డ్యామేజ్ చేస్తుందని భావించారా? అందుకే కవిత ఏకాఏకీన అమెరికాకు పంపించారా? అవుననే సంకేతాలు గులాబీ పార్టీ నుంచి బలంగా వినిపిస్తున్నాయి.బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శుక్రవారం రాత్రి అమెరికాకు వెళ్లారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకి ఆమె వెంట కొందరు నేతలు వచ్చారు. కొడుకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్నట్లు ఆ పార్టీ వర్గాల మాట. కవిత ఫారెన్ టూర్‌కు ఢిల్లీ సీబీఐ స్పెషల్ కోర్టు అనుమతి మంజూరు చేసింది. కనీసం అనుచరులకు ఫారెన్ వెళ్తున్నట్లు కవిత చెప్పలేదని సమాచారం. ఇంత సడెన్‌గా వెళ్లడం వెనుక అనేక కారణాలు ఉన్నాయని అంటున్నారు.అంతకుముందు ఏం జరిగింది? శుక్రవారం రాత్రి హరీష్‌రావు ఇంటికి కేటీఆర్ వెళ్లారు. ప్రస్తుతం హరీష్‌రావు ఫాదర్ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో బావాబావమరుదుల మధ్య కవిత విషయం ప్రస్తావనకు వచ్చినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.తమ పార్టీ ఇప్పటికీ బలంగా ఉందని, ఫ్యామిలీ సమస్యల వల్ల పార్టీ ఇమేజ్ డ్యామేజ్ అయ్యే అవకాశాలున్నాయని చర్చించుకున్నారట. ఇప్పుడున్న పరిస్థితుల్లో కవితను కొద్దిరోజులు హైదరాబాద్, మీడియా నుంచి దూరంగా ఉంచితే పరిస్థితులు సద్దుమణిగే అవకాశాలు ఉంటాయని మాట్లాడుకున్నారట. ఈ విషయాన్ని కవితకు చేరవేయడం, ఆమె వెంటనే అమెరికాకు బయలుదేరడం జరిగిపోయింది.పార్టీ పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న దానిపై కొన్నాళ్లుగా కారు పార్టీలో అంతర్గత చర్చ జరిగింది.. జరుగుతోంది కూడా. కాకపోతే ఏ ఒక్కరూ ఈ విషయంపై బయట పడలేదు. తొలుత కేటీఆర్‌కు అధ్యక్షుడి పదవి అప్పగించి కవితకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని భావించారట. అలాగైతే హరీష్‌రావు నుంచి ఇబ్బందులు వస్తాయని భావించారట.ఈ క్రమంలో కవితను పక్కనపెట్టారని అంటున్నారు. ఈ విషయం తెలిసి అగ్గి మీద గుగ్గిలం అయ్యారట కవిత. కావాలనే తనను పార్టీ నుంచి పక్కనపెట్టారని రుసరుసలాడారు. పార్టీ పగ్గాలు కేటీఆర్‌కు అప్పగించినా కలిసి పని చేస్తానని మీడియా ముందు బయటపెట్టారు హరీష్‌రావు. ఈ విషయంలో కేసీఆర్ చెప్పిన లైన్ దానని స్పష్టంచేశారు.ఫ్యామిలీ విషయాలు ఇక్కడ చర్చిస్తే మీడియాలో రకరకాలుగా వార్తలు వస్తాయని, తద్వారా పార్టీ ఇమేజ్ మరింత డ్యామేజ్ అవుతుందని భావిస్తున్నారు గులాబీ బాస్. ఈక్రమంలో కవితను అమెరికాకు పంపించారట. రేపోమాపో రేపో మాపో కేటీఆర్, కేసీఆర్ అమెరికా వెళ్తారని అంటున్నారు. అక్కడ సెటిల్ చేసుకుని వస్తారని అంటున్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ గురించి ఇంకెన్ని విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాలి.

# సింధూ నదీ జలాల వినియోగం..భారీ రిజర్వాయర్ల నిర్మాణం

న్యూఢిల్లీ, సింధు, జీలం, చీనాబ్ నదులపై కొత్తగా డ్యామ్‌లు, భారీ రిజర్వాయర్లు త్వరితగతిన నిర్మించాలని భారత్ భావిస్తోంది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు శీఘ్ర ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. పాక్‌కు ఇక్కడి నుంచిచుక్కనీరు కూడా వెళ్లకుండా ఉండేలా వీటిని అమలు చేయబోతున్నారు. ఏప్రిల్ 22 పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోయిన తర్వాత పాకిస్థాన్‌తో భారత్.. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సింధు నది, దాని ఉప నదులైన జీలం, చీనాబ్ జల వనరుల్ని మరింత మెరుగ్గా ఉపయోగించుకునేందుకు ఆయా నదులపై కొత్త ప్రాజెక్టుల ప్రణాళిక, అమలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రణబీర్ కాలువను విస్తరించే ప్రణాళికను కూడా సిద్ధం చేస్తున్నట్టు- సమాచారం. ఇది భారత్ చేపట్టాలని భావిస్తోన్న కీలక ప్రణాళికలలో ఒకటి. రణబీర్ కాలువ పొడవును 120 కి.మీ.కు రెట్టింపు చేయాలని, తద్వారా సెకనుకు 150 క్యూబిక్ మీటర్ల నీటిని మళ్లించడానికి వీలు కలుగుతుందని అంటున్నారు. ప్రస్తుతం దీని సామర్థ్యం 40 క్యూబిక్ మీటర్లు. దీంతోపాటు-, సింధు, చీనాబ్, జీలం నదుల నుండి నీటిని మూడు ఉత్తర భారత రాష్ట్రాలలోని నదుల్లోకి తరలించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు- రాయిటర్స్ వార్తా సంస్థ చెబుతోంది. ప్రస్తుతం సింధు దాని ఉప నదులపై ఉన్న చిన్న జలవిద్యుత్



ప్రాజెక్టుల సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 3,360 మెగావాట్ల నుండి 12,000 మెగావాట్లకు పెంచాలని భావిస్తున్నట్టు- చెబుతున్నారు. కొత్తగా భారత్ ఈ నదులపై కనీసం ఐదు నీటి నిల్వ ప్రాజెక్టులను గుర్తించిందని, వాటిలో నాలుగు చీనాబ్, జీలం ఉపనదులపై ఉన్నాయని తెలిపింది. కాగా, పాకిస్తాన్‌లోని దాదాపు 80 శాతంపొలాలకి, అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా సింధు నీటి ప్రవాహంపై ఆధారపడి ఉన్నాయి. పాకిస్తాన్ తో భారత్ సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తర్వాత మే ప్రారంభంలో పాకిస్తాన్‌లోని కీలకమైన ప్రాజెక్టుల్లో నీరు 90శాతం వరకు తగ్గిందని చెబుతున్నారు. సింధునది టిబెట్‌లోని మానసరోవర్ దగ్గర ఉద్భవించి, అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ నది భారత్ లోని ఉత్తర, పాకిస్తాన్ లోని తూర్పు, ఆగ్నేయ ప్రాంతాల్లో ప్రవహిస్తుంది.

# అదృశ్య శక్తుల బిగి కౌగిలిలో సీఎం రేవంత్ రెడ్డి?

హైదరాబాద్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన పదవుల ఎంపిక విషయంలో స్వంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారా? తనవారిని ఆ పదవుల్లో నియమించుకోలేక అంతర్మథనం చెందుతున్నారా? అంటే అవుననే అంటున్నాయి సచివాలయ వర్గాలు. సచివాలయంలో ముఖ్య పోస్టుల్లో నియామకాల విషయంలో ఇది స్పష్టమవుతున్నదని చెబుతున్నాయి. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతి కుమారి కొనసాగింపు మొదలు.. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఎంపిక, సీఎం కార్యాలయంలో వీ శేషాద్రి, కేఎస్ శ్రీనివాస రాజు నియామకం, రెవెన్యూ ముఖ్య కార్యదర్శిగా నవీన్ మిట్టల్ కొనసాగింపులో రేవంత్ రెడ్డి ప్రమేయం అంతంత మాత్రమేనంటున్నాయి విశ్వసనీయ వర్గాలు. అదృశ్య శక్తులు రేవంత్‌ను నడిపిస్తున్నాయని, అందుకే కీలకమైన పోస్టులకు అధికారుల ఎంపికలో ఆయన మాట నెగ్గడం లేదనే టాక్ సచివాలయవర్గాల్లో విస్తృతంగా నడుస్తున్నది.

అద్భుతాలు జరుగుతాయని ఊహలు

తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమిపాలై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే అద్భుతాలు జరుగుతాయని అందరూ ఊహించారు. అందులో సచివాలయం ఉద్యోగులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు కూడా ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియమితులైన ప్రధాన కార్యదర్శి ఏ శాంతి కుమారిని తొలగించకుండా కొనసాగించడం ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో సచివాలయం ఉద్యోగులను ఆశ్చర్యానికి గురిచేసింది. రెండు మూడు నెలలు వేచి చూసిన తరువాత ఇక ఆమెను పంపించడం కష్టం, రిటైర్మెంట్ అయ్యే వరకు కొనసాగుతుందనే నిర్ణయానికి వచ్చారు. గత ప్రభుత్వం కాపు నాయకుల అండదండలతో కీలకమైన పదవిని దక్కించుకున్న ఆమె ఈ ప్రభుత్వంలో కూడా ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పుతున్న నాయకుడి ఆశీస్సులతో కొనసాగారనే చర్చలు అప్పట్లోనే వినిపించాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగిన రిటైర్డ్ అధికారి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ప్రముఖ నాయకుడిగా చెలమణీ అవుతున్నారు. ఆయన ఆశీస్సులతో పాటు ఇక్కడి ప్రభుత్వంలోని ఒక పెద్ద మనిషి సహకారంతో సునాయసంగా తన పదవీకాలం పూర్తి చేసుకున్నారని అంటున్నారు. ఈమె పనితీరు విషయంలో రేవంత్ రెడ్డి అసహనంతో ఉండేవారని, తన సమీక్షా సమావేశాల్లో కూడా పెద్దగా ప్రాముఖ్యం ఇచ్చేవారు కాదని సీనియర్ అధికారులు గుర్తు చేసుకుంటున్నారు. ఆమె స్థానంలో రామకృష్ణారావు కూడా ఆ ఢిల్లీ పెద్ద ఆశీస్సులతోనే నియమితులయ్యారని, ఇక్కడున్న ప్రభుత్వంలోని ఒక పెద్ద మనిషి కూడా తన వంతు సహకారం అందించారని వారు పేర్కొంటున్నారు.

ఢిల్లీలోని కీలక నేత అండతో శేషాద్రి!

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంవో కార్యాలయంలో శేషాద్రి పనిచేశారు. ముక్కుసూటి అధికారి, నిజాయితీపరుడు అనే పేరు ఉన్నప్పటికీ, సీఎంవోలో కొనసాగించే పరిస్థితి లేదంటున్నారు. నెలలకొద్దీ కాలంగా పైళ్లు మూలుగుతున్నాయని, తొందరగా వాటిని పరిష్కరించడంలో చొరవ లేదని ప్రజా ప్రతినిధులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈయన కొనసాగింపు వెనకాల పలు కథనాలు విన్పిస్తున్నాయి. ఇక మాజీ ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాస రాజు ఏపీ ప్రభుత్వంలో టీటీడీ ఎగ్జిక్యూటివ్ అధికారి పోస్టును ఆశించగా, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుముఖత వ్యక్తం చేయలేదని టీడీపీ ముఖ్య నాయకులు అంటున్నారు. రాజు తన పదవికి గత ఏడాది జూన్ నెలలో వీఆర్ఎస్ సమర్పించిన విషయం తెలిసిందే. ఆ మరుసటి నెల జూలైలో తెలంగాణ ప్రభుత్వంలో సలహాదారుడిగా నియమితులయ్యారు. ఏ అదృశ్య



శక్తి పనిచేసిందో తెలియదు కానీ ఈ ఏడాది మే 1 న తెలంగాణ సీఎంవో ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. అప్పటికే శేషాద్రి ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండగా, చిత్తూరు జిల్లా వాసి రాజును నియమించడం ఏంటని తెలంగాణవాదులు చర్చించుకున్నారు. జ్యూడిషియరీలో కీలక పదవిలో పనిచేసిన పెద్దాయన సిఫారసు మేరకు సీఎంవోలో ముఖ్య కార్యదర్శిగా పోస్టు కొట్టేశారనే చర్చ సచివాలయంలో జోరుగా సాగింది.

మిట్టల్ కొనసాగింపుపై విమర్శలు

ధరణి వెబ్ పోర్టల్ కేసీఆర్ కుటుంబానికి కల్పతరువుగా మారిందని, తెలంగాణ రైతుల పాలిట ఉరితాడుగా మారిందని ప్రతిపక్షంలో ఉన్న రేవంత్ రెడ్డి మొదలు కాంగ్రెస్ పెద్దలు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు లక్షల ఎకరాలను పంచిపెడితే, ఆ భూములను ధరణి పేరుతో కేసీఆర్ కుటుంబం గుంజుకుని లక్షల కోట్లు వెనకేసుకుందని రేవంత్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూముల క్రమబద్ధీకరణ, వివాదాస్పద ప్రభుత్వ భూములు పరాధీనం, కేసీఆర్ కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా రెవెన్యూ ముఖ్య కార్యదర్శిగా, సీసీఎల్ఏ గా విధులు నిర్వహించారని కాంగ్రెస్ నాయకులే విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తరువాత నవీన్ మిట్టల్‌ను తప్పించి ప్రాధాన్యం లేని శాఖకు పంపిస్తారని చాలా మంది ఊహించారు. కానీ అందరి అంచనాలూ తలకిందులయ్యాయి. ఇప్పటికీ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా, సీసీఎల్ఏగా ఆయనే కొనసాగుతుండటాన్ని కాంగ్రెస్ శ్రేణులు, దగాపడ్డ భూ యజమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. వేలాది ఎకరాల విలువైన భూ కుంభకోణాల వెనకాల ఈయన హస్తం ఉందని, ఎందుకు కొనసాగిస్తున్నారో అర్థం కావడం లేదని కాంగ్రెస్ నాయకులే అంతర్మథనం చెందుతున్నారని తెలిసింది. ఈయన కొనసాగింపు వెనకాల కూడా అదృశ్య శక్తి ఉందని, ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల ఆశీస్సులతో దర్జాగా కొనసాగుతున్నాడని అంటున్నారు.

అర్వింద్‌పైనా చర్యల్లేవు!

మున్సిపల్ వ్యవహారాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్‌పై కఠిన చర్యలు ఉంటాయని అందరూ భ్రమపడ్డారు. ప్రభుత్వం వచ్చిన కొత్తలో విచారణ, చర్యలు అంటూ నానా హడావుడి జరిగింది. ఇప్పుడాయన విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇసుమంతైనా చర్యలు తీసుకోలేదని ఉద్యోగులే వ్యాఖ్యానిస్తుండటం విశేషం. ఇవన్నీ గమనిస్తే ప్రభుత్వంలో కీలక పదవుల ఎంపిక విషయంలో కానీ, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యల విషయంలో కానీ.. రేవంత్ రెడ్డి అడుగు ముందు వేయకుండా అడ్డుకుంటున్న శక్తులు ఎవరనే దానిపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది.

# రాష్ట్రపతి సంధించిన లేఖతో రాజ్యాంగ ధర్మ సంకటం



న్యూఢిల్లీ,రాష్ట్రపతి అంటే రాజ్యాంగం ప్రకారం సర్వస్వం. రాష్ట్రపతి కదిలే రాజ్యాంగంగా చూడాలి. ఈ దేశంలో ఏ ఉత్తర్వు అయినా రాష్ట్రపతి సంతకం తోనే వెలువడుతుంది. అలా పాలన అంతా రాష్ట్రపతి చేతుల మీదుగా సాగుతుంది. భారత ప్రధాన న్యాయమూర్తిని రాష్ట్రపతి ప్రమాణం చేయిస్తారు. అయితే రాష్ట్రపతిని కూడా ప్రధాన న్యాయమూర్తి ప్రమాణం చేయిస్తారు.కానీ ప్రధాన న్యాయమూర్తిని నియమించే అధికారం ఉత్తర్వులు జారీ చేసే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. అలాగే ఎంతటి ఉన్నత పదవులలో ఉన్న వారిని అయినా అభిశంశించి గద్దె దించే అధికారం పార్లమెంట్ కి ఉంది. దానిని ఆమోదించే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఇలా చూస్తే కనుక భారత రాజ్యాంగంలో ఎన్నో కనిపిస్తాయి.ఇక్కడ అన్నీ కీలక వ్యవస్థలే. ఎవరు తక్కువ ఎక్కువ అన్నది కాదు. న్యాయవ్యవస్థ, శాసన వ్యవస్థ, కార్యనిర్వహణ వ్యవస్థ మూడూ కలసికట్టుగానే పనిచేయాలి. అయితే న్యాయ వ్యవస్థకు ఉన్న మరో అధికారం ఏమిటి అంటే రాజ్యాంగ సహితంగా ఏ నిర్ణయం అయినా అమలు అవుతోందా లేదా అన్నది చూడడం. దేశంలో క్లిష్ట పరిస్థితులు ఉన్నపుడు లేదా కీలక నిర్ణయాలు తీసుకోవలన్నపుడు రాష్ట్రపతి కార్యాలయం న్యాయ వ్యవస్థనే సంప్రదించి సలహా సూచనలు తీసుకుంటుంది.ఇలా సాగుతున్న భారత దేశ పాలనలో ఇపుడు ఒక సరికొత్త ధర్మ సంకటం రాజ్యాంగ పరంగా ఏర్పడింది. అదేంటి అంటే రాష్ట్రపతులు గవర్నర్ల నిర్ణయాధికారాల విషయంలో ఒక పరిధిని కాల పరిమితిని విధిస్తూ న్యాయ వ్యవస్థ శాసించగలదా అన్నది. దాని మీద ఈ మధ్యనే సుప్రీంకోర్టు మూడు నెలల వ్యవధిలో తమ వద్దకు వచ్చిన ఒక ఫైల్ ని క్లియర్ చేసి పంపాలని గడువు విధించింది. అలా కనుక చేయకపోతే ఆ బిల్లుని ఆమోదించినట్లే అని కూడా పేర్కొంది.దీని మీద అనేక రకాలైన చర్చలు చాలా జరిగాయి. ఇపుడు నేరుగా రాష్ట్రపతి సుప్రీం కోర్టుకు ఈ విషయంలో లేఖ రాయడంతో ఇది అత్యంత ముఖ్యమైన చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర గవర్నర్లు పంపే బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి కాలపరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన చారిత్రక తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 14 ప్రశ్నలు సంధించారని సమాచారంగా ఉంది. రాష్ట్రపతికి కాలపరిమితి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదా అని రాష్ట్రపతి సందేహం వ్యక్తం చేశారు.తమిళనాడు ప్రభుత్వం, ఆ రాష్ట్ర గవర్నర్ మధ్య నెలకొన్న వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ గవర్నర్లు పంపే బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతికి గడువు విధించింది. రాష్ట్రపతి అనుమతి కోసం తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి 10 బిల్లులను తన వద్ద అట్టే పెట్టుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పుపై కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తూ ఈ నెల 13న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓ ప్రశ్నావళిని పంపినట్లు వార్తలు వచ్చాయి.తమ అనుమతి కోసం వచ్చిన బిల్లులపై చర్య తీసుకోవడానికి ఆర్టికల్ 143 ప్రకారం గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి నిర్దేశించి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదా అని ఆమె సుప్రీంకోర్టు ప్రశ్నించారు. ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి ఇచ్చే అనుమతులు సమర్థనీయమా అనే విషయంపై సైతం సుప్రీంకోర్టు భిన్నమైన తీర్పులు ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే దీని మీద వామపక్షాలతో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా విమర్శలు చేశారు. సుప్రీం కోర్టుని రాష్ట్రపతి వివరణ కోరడం అన్నది సుప్రీం తీర్పుని సవాల్ చేయడమే అవుతుందని అంటున్నారు.మరో వైపు చూస్తే పార్లమెంట్ లో ఏ చట్టం చేయాలి అని ఎవరూ శాసించలేరు. అలాగే చేసిన చట్టం మీద ఆమోదముద్ర వేసే విషయంలో రాష్ట్రపతి అధికారాలని కూడా ప్రశ్నించజాలరని కొందరు మేధావులు అంటున్నారు. కొన్ని చట్టాలు రాజ్యాంగ హితమైనవి కాకపోవచ్చు, జాతి ప్రయోజనాలకు ఇబ్బంది కావచ్చు అలాంటి వాటిని విచక్షణతో నిలుపు చేయాల్సిన అవసరం ఉంటుందని అంటున్న వారూ ఉన్నారు అయితే నిర్ణీత కాల పరిమితి లేకపోతే కొన్ని చట్టాల ద్వారా జనాలకు ప్రయోజనాలు వేగంగా అందే అవకాశాలు తగ్గిపోతాయని అంటున్న వారూ ఉన్నారు. చూడాలి మరి దీని మీద తదనంతర పరిణామాలు ఎలా ఉంటాయో.


# పాక్‌కు సున్నితమైన సమాచారం లీక్.. హర్యానా విద్యార్థి అరెస్ట్



హర్యానా: భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. దాయాది దేశానికి సున్నితమైన విషయాలను చేరవేస్తున్న హర్యానాకు చెందిన ఓ కళాశాల విద్యార్థిని (హర్యానా విద్యార్థి) అధికారులు తాజాగా అరెస్ట్ చేశారు. ఈ విద్యార్థి దేశంలో గూఢచర్యం చేస్తూ, పాక్ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులతో సున్నితమైన చిత్రాలు పంచుకున్నట్లు (పాకిస్థాన్‌తో పంచుకున్న కీలక సమాచారం) దర్యాప్తులో తేలింది.హర్యానాలోని మస్తగఢ్ చీకా గ్రామానికి చెందిన 25 ఏండ్ల దేవేంద్ర సింగ్ ధిల్లాన్ (దేవేంద్ర సింగ్ ధిల్లాన్).. పాటియాలలోని ఖల్సా కళాశాలలో ఎంఏ పొలిటికల్ సైన్స్ చదువుతున్నాడు. అయితే, అతడు ఇటీవలే తన ఫేస్‌బుక్ ఖాతాలో పిస్టోల్, గన్ చిత్రాలను అప్‌లోడ్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన అధికారులు అతడిపై నిఘా పెట్టారు. ఈ భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన ఉద్రిక్తతల గురించి ఆ యువకుడు పాక్ ఏజెన్సీకి సమాచారం ఇచ్చినట్లు నిఘా అధికారులు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించిన గుర్తించబడిన పాక్‌కు చేరవేసినట్లు ఇంటెలిజెన్స్ సమాచారం అందింది. దీంతో అధికారులు విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో నవంబర్‌లో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్‌కు వెళ్లిన దేవేంద్ర.. పాక్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులతో సున్నితమైన విషయాలను పంచుకుంటున్నట్లు తేలింది.ధిల్లాన్‌ను ఆకర్షించేందుకు పాక్ నిఘా అధికారులు పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేసినట్లు అధికారులు గుర్తించారు. పాటియాలా మిలిటరీ కంటోన్మెంట్ చిత్రాలను కూడా పాక్ అధికారులతో పంచుకున్నట్లు కైథాల్ పోలీస్ సూపరింటెండెంట్ ఆస్తా మోదీ చెప్పారు. విద్యార్థి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు.. దాన్ని ఫోరెన్సిక్ దర్యాప్తు కోసం పంపారు. అంతేకాదు, పాక్ అధికారులు, విద్యార్థి మధ్య జరిగిన నగదు లావాదేవీలను తెలుసుకునేందుకు అతని బ్యాంకు ఖాతాలను

# అమరావతి మీద మళ్ళీ మొదలైందా ?

అమరావతి,ఏపీకి రాజధానిగా అమరావతిని డిక్లేర్ చేశారు. కానీ ఆ రాజధానికి ఒక రూపూ షేపూ రావడానికి మాత్రం యుగాలూ జగాలు పడుతోంది. ఏపీలో తలో రకంగా రాజకీయ స్వరాలు వినిపిస్తూ ఉంటారు. దానికి తోడు వివిధ ప్రాంతాలు వాటి మధ్య ఎంతో కొంత వైరుధ్యాలు ఇవన్నీ కలసి ఒక కొత్త రాజధాని విషయంలో అడుగులు వేగంగా ముందుకు పడనీయకుండా చేస్తున్నాయా అన్న చర్చ ఉంది.అయితే గతమంతా అలా గడిచిపోయింది. మూడు రాజధానులు అంటూ వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎత్తుకున్న స్లోగన్ 2024 ఎన్నికల్లో బూమరాంగ్ అయింది. ఆ పార్టీకి 11 సీట్లు కట్టబెట్టింది. ఇక అమరావతిని తగ్గించాలని చూసినందుకు కోస్తా జనాలు నమ్మలేదు, విశాఖ రాజధాని అన్నా ఉత్తరాంధ్రులూ పొంగలేదు, రాయలసీమ వాసులూ మనకొక రాజధాని ఉండాలని భావించి అలా చేయకుండా వివాదం చేస్తున్నారని ఆగ్రహించి వైసీపీని ఓడించారు అన్న విశ్లేషణలు ఉన్నాయి.ఇక టీడీపీ కూటమికి 2024 ఎన్నికల్లో మంచి మాండేట్ ఇచ్చారు. నూటికి 95 శాతం సీట్లు ఇచ్చారు. దాంతో అధికారంలోకి వచ్చిన కూటమి పెద్దలు అమరావతి మీద ఫోకస్ పెట్టారు. అంతవరకూ బాగానే ఉంది కానీ అమరావతిలోని 33 వేల ఎకరాలను డెవలప్ చేయకుండా మరో 40 వేల ఎకరాలు అవసరం అవుతాయన్నదే ఇపుడు విపక్షాలకు ఆయుధంగా మారుతోంది. 2019 నుంచి 2024 మధ్యలో వైసీపీ చేసిన పొరపాట్లను కూటమి చేయకూడదు అని అంటున్నారు.ఏపీకి ఏకైక రాజధానిగా అమరావతి ఉండాలి. అందులో రెండవ మాట లేదు, వివాదం అంతకంటే లేదు. కానీ అదే సమయంలో ఇతర ప్రాంతాల వాసులకు కన్నెర్ర అయ్యేలా అమరావతి జపం చేయకూడదు, 2014 నుంచి 2019 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం చేసింది ఇదే. దానికి గానూ 2019లో చేదు ఫలితాలు ఆ పార్టీ అందుకుంది. మరి 2024లో ఎక్కువ సీట్లు రాగానే ప్రజా తీర్పుని వేరేగా ఊహించుకోవడమూ తప్పే అని అంటున్నారు.అమరావతిని వద్దు అని వైసీపీ ఎలా ప్రజల తీర్పుని వేరేగా అర్థం చేసుకుందో అమరావతి మాత్రమే ముద్దు అని జనాలు అనుకుని తీర్పు ఇచ్చారని భావించడమూ తప్పే అని అంటున్నారు. ఇది ప్రజా తీర్పుని తమను అనుకూలంగా అన్వయించుకోవడమే అంటున్నారు. అందుకే మెల్లగా విపక్షాలు గొంతు సవరిస్తున్నాయి.వైసీపీ నేతలు అయితే అమరావతి రాజధాని విషయంలో కొంత మౌనం వహిస్తున్నా కొత్తగా ఆ పార్టీలో చేరిన సాకే శైలజానాథ్ మాత్రం అమరావతినే పట్టించుకుని మిగిలిన ప్రాంతాలను వదిలేస్తారా అని సూటి ప్రశ్నలే సంధించారు. ఇపుడు ఆయనకు తోడుగా కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ కూడా అమరావతి రాజధాని



నచ్చడం లేదు అని డైరెక్ట్ గానే ప్రకటించేశారు. వేల ఎకరాలు ఎందుకు అని కూడా లాజిక్ తో కూడిన ప్రశ్నను సంధించారు.ఇప్పటికే అమరావతి రాజధాని కోసం అన్ని వేల కోట్లు అప్పులు తేవడమేంటని సీపీఐ ప్రశ్నించింది. ఇలా విపక్షాలు కనుక తమ స్వరాన్ని గట్టిగా వినిపిస్తే జనాల ఆలోచనలలో కూడా మారు వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. అతి ఉత్సహం తో కాకుండా వాస్తవ పరిస్థితులను గమనంలోకి తీసుకుని కూటమి పెద్దలు అమరావతి రాజధాని విషయంలో అడుగులు వేయడం మంచిది అని అంటున్నారు.కేవలం అయిదేళ్ళకు మాత్రమే ప్రజలు అధికారం ఇచ్చారు అన్న సంగతిని వారు ఈ సందర్భంగా గమనంలోకి తీసుకోవాలి. పాతిక నుంచి యాభై ఏళ్ళ పై చిలుకు సమయం పట్టే ప్రాజెక్టులకు శ్రీకారం చుడితే అది ఇబ్బందిగా మారుతుందని గ్రహించాల్సి ఉంది అంటున్నారు. తమ తమ అయిదేళ్ళ టెర్మ్ లో తాము ఏమి చేయగలమో చేసి మరోసారి ప్రజల తీర్పుని కోరాల్సి ఉంటుందని కూడా గ్రహించాలని అంటున్నారు. ఈసారి అమరావతి రాజధాని విషయంలో ఏమైనా జరిగితే మాత్రం దానికి కూటమి పెద్దలే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని కూడా గమనంలోకి తీసుకోవాలని అంటున్నారు.

## గులాబీలతో ఆహ్వానిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

హైదరాబాద్,ప్రజారవాణాను ప్రోత్సహించేందుకు టీజీఎస్ఆర్టీసీ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ప్రయాణికులను ఆకట్టుకోవడంతో పాటు, వారిని మర్యాదగా పలకరిస్తూ...గులాబీ పూలు ఇస్తూ ఆహ్వానిస్తున్నారు. అంతేగాకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రైవేటు వాహనాల్లో వెళుతూ ప్రమాదాల బారిన పడొద్దన్న కండక్టర్లు.. సురక్షితమైన, సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com